
ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

మెదక్ | సంపుటి: 19 సంచి07 | సోమవారం, 08 సెప్టెంబర్ 2025 | పేజీలు: 06 | వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamada-Vijayawada-Guntur-Vizag Adilabad Kurnool | www.prajaswaramdaily.com

# నరక కూపాలుగా గురుకులాలు



కేసీఆర్ హయాంలో గురుకులాలు దేశానికే ఆదర్శం

**కాంగ్రెస్ పాలనలో గురుకులాల పరిస్థితి దయనీయం అంటూ హరీశ్ రావు ఫైర్**
**సీఎం రేవంత్ రెడ్డి హామీలు నీటిమూటలయ్యాయని విమర్శ**
**సిబ్బంది జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్**

రాష్ట్రంలోని గురుకుల విద్యాసంస్థల పరిస్థితిపై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గురుకులాలు నరక కూపాలుగా మారాయని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. విద్యార్థులు ఫుడ్ పాయిజనింగ్, పాముకాట్లు, విష జ్వరాల బారిన పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు స్పందిస్తూ.. "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా గురుకులాలను పర్యవేక్షిస్తానని చెప్పిన మాటలు నీటి మూటలయ్యాయి. కల్తీ ఆహారం పెడితే జైలుకేనని చేసిన హెచ్చరికలు గాలి మాటలయ్యాయి" అని ఎద్దేవా చేశారు. గురుకులాల్లో పనిచేస్తున్న దాదాపు 2500 మంది కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ సిబ్బందికి గత రెండు నెలలుగా జీతాలు చెల్లించకపోవడం దారుణమని అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం నాడు ఆడంబరపు ప్రకటనలు ఇచ్చే బదులు, వారికి సకాలంలో జీతాలు చెల్లించడంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని సూచించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంతో ప్రస్తుత పరిస్థితిని పోలుస్తూ, కేసీఆర్ హయాంలో గురుకులాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని హరీశ్ రావు గుర్తుచేశారు. "నాడు కేసీఆర్ గురుకులాల సంఖ్యను ..మిగతా 3లో






# స్థానిక సమరమే లక్ష్యంగా సభ

**15న కామారెడ్డిలో కాంగ్రెస్ భారీ బహిరంగ సభ**
**బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై విజయోత్సవ వేడుక**
**హాజరుకానున్న రాహుల్ గాంధీ, ఖర్గే, సీఎం సిద్ధరామయ్య**
**స్థానిక ఎన్నికలే లక్ష్యంగా బీసీ వర్గాలను ఆకట్టుకునే వ్యూహం**
**లక్ష మందికి పైగా జనసమీకరణకు పార్టీ ప్రణాళిక**
**గతంలో బీసీ డిక్లరేషన్ ప్రకటించిన చోటే సభ నిర్వహణ**

హైదరాబాద్, ప్రజాస్వరం

త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని, బీసీ ఓటు బ్యాంకును తమ వైపు తిప్పుకోవడానికి అధికార కాంగ్రెస్ పార్టీ భారీ ప్రణాళిక రచించింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే దిశగా ప్రభుత్వం తీసుకున్న చర్యలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు ఈ నెల 15న కామారెడ్డిలో 'బీసీ డిక్లరేషన్ విజయోత్సవ సభ'ను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని నిర్ణయించింది. ఈ సభ ద్వారానే ..మిగతా 3లో

# ఇది ప్రభుత్వ హత్యే

**ములుగులో పారిశుద్ధ్య కార్మికుడి ఆత్మహత్య**
**ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని కేటీఆర్ తీవ్ర విమర్శ**
**సీఎం రేవంత్, మంత్రి సీతక్క నైతిక బాధ్యత వహించాలని డిమాండ్**
**మృతుడి కుటుంబానికి రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్న కేటీఆర్**
**ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నంపై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం**
**బాధిత కుటుంబాన్ని ఫోన్‌లో పరామర్శించి, అండగా ఉంటామని హామీ**

హైదరాబాద్, ప్రజాస్వరం

ములుగు జిల్లాలో పారిశుద్ధ్య కార్మికుడు మైదం మహేశ్ ఆత్మహత్య ఘటన తీవ్ర రాజకీయ దుమారం రేపుతోంది. నెలల తరబడి జీతాలు అందకపోవడంతో మనస్తాపానికి గురై ఓ కార్మికుడు ప్రాణాలు తీసుకోవడం 'ప్రభుత్వ హత్య' కిందకే వస్తుందని అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ..మిగతా 2లో



# దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్

**కేంద్ర ఎన్నికల సంఘం సన్నాహాలు**
**దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా సమగ్ర సవరణకు ఈసీ ప్లాన్**
**ఈ నెల 10న రాష్ట్రాల ముఖ్య ఎన్నికల అధికారులతో కీలక సమావేశం**
**ఇంటింటి సర్వే ద్వారా ఓటర్ల వివరాల క్షుణ్ణమైన పరిశీలన**
**అక్రమ వలసదారులను జాబితా నుంచి తొలగించడమే ప్రధాన లక్ష్యం**
**2026 అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈసీ ముందస్తు చర్యలు**
**బీహార్ తరహాలోనే దేశమంతటా అమలుకు సన్నాహాలు**




03

# రేవంత్ రెడ్డి వరాల జల్లు

**హైదరాబాద్ లో కొత్త మార్పులు**
**శివారు ప్రాంతలకు ఇకపై సులభంగా తాగునీరు**
**మంచినీటి సరఫరా పథకాలను ప్రారంభించనున్న సీఎం**
**రెండేళ్లలో ప్రాజెక్ట్ పూర్త**

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్ పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరాల జల్లు కురిపించారు. మంచినీటి సరఫరా నెట్ వర్క్ ను మరింత బలోపేతం చేయడానికి, వేగంగా ..మిగతా 2లో




02


**గుడ్ జాబ్.. గ్రేట్ వర్క్**



03

## దసరా, దీపావళికి స్పెషల్ ట్రైన్స్

**122 ప్రత్యేక రైళ్లు ప్రకటించిన రైల్వే శాఖ**
**సెప్టెంబర్ 10 నుంచి డిసెంబర్ 3 వరకు అందుబాటులో**
**మధురై, చెన్నై, బెంగళూరు సహా పలు మార్గాల్లో రైళ్లు**
**వివరాల కోసం అధికారిక వెబ్‌సైట్ చూడాలని సూచన**




02

## జీహెచ్ఎంసీ @2.68 లక్షల గణేష్ విగ్రహాలు

**జీహెచ్ఎంసీలో ఇప్పటివరకు 2.68 లక్షల విగ్రహాల నిమజ్జనం**
**ఖైరతాబాద్, కూకట్‌పల్లి జోన్లలో అత్యధిక నిమజ్జనాలు**
**హుస్సేన్ సాగర్ సహా 20 చెరువుల్లో ప్రత్యేక ఏర్పాట్లు**
**నగరంలో 74 ఆర్టిఫీషియల్ పాండ్స్ ఏర్పాటు చేసిన జీహెచ్ఎంసీ**

# ఐటీ సంస్థలకు కేంద్రం భరోసా

**అమెరికా ఔట్‌సోర్సింగ్‌పై ట్రంప్ విధానాలతో ఐటీ రంగంలో ఆందోళన**
**రంగంలోకి దిగిన కేంద్రం.. విదేశీ కంపెనీలతో, ప్రభుత్వాలతో చర్చలు**
**ఐటీ ఉద్యోగాలను కాపాడతామని కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ భరోసా**
**సేవలపైనే కాకుండా, దేశీయ తయారీ రంగంపైనా ప్రభుత్వం దృష్టి**
**ఈ ఏడాది ఐటీ రంగంలో మంచి వృద్ధి ఉంటుందన్న నాస్కామ్ అంచనా**
**కొత్తగా లక్షకు పైగా ఉద్యోగాలు వస్తాయని నివేదిక వెల్లడి**



హైదరాబాద్, ప్రజాస్వరం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఔట్‌సోర్సింగ్‌పై కఠిన వైఖరి అవలంబించవచ్చనే భయాలు పెరుగుతున్న నేపథ్యంలో భారత్ కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. సుమారు 300 బిలియన్ డాలర్ల విలువైన దేశీయ టెక్నాలజీ పరిశ్రమను, దానిపై ఆధారపడిన లక్షలాది ఉద్యోగాలను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం పక్కా వ్యూహంతో ముందుకు ..మిగతా 2లో



02

## హైదరాబాద్‌లో డ్రగ్స్ ఫ్యాక్టరీ

**మందుల మాటున రూ.12 వేల కోట్ల దందా!**
**చర్లపల్లి పారిశ్రామిక వాడలో భారీ డ్రగ్స్ తయారీ కేంద్రం గుర్తింపు**
**అత్యవసర మందుల మాటున మెఫెడ్రోన్ ఉత్పత్తి చేస్తున్న ఫ్యాక్టరీ**
**మహారాష్ట్ర పోలీసులు, ఎన్‌సీబీ అధికారుల సంయుక్త ఆపరేషన్**
**బంగ్లాదేశ్ యువతి సహా మొత్తం 12 మంది నిందితుల అరెస్ట్**
**మహారాష్ట్రలో చిన్న క్లూతో బయటపడిన దేశవ్యాప్త నెట్‌వర్క్**



# జీహెచ్‌ఎంసీ @2.68 లక్షల గణేష్ విగ్రహాలు

- **జీహెచ్‌ఎంసీ పరిధిలో ఇప్పటివరకు 2.68 లక్షల విగ్రహాల నిమజ్జనం**
- **ఖైరతాబాద్, కూకట్‌పల్లి జోన్లలో అత్యధిక నిమజ్జనాలు**
- **హుస్సేన్ సాగర్ సహా 20 చెరువుల్లో ప్రత్యేక ఏర్పాట్లు**
- **నగరంలో 74 ఆర్టిఫీషియల్ పాండ్స్ ఏర్పాటు చేసిన జీహెచ్‌ఎంసీ**


హైదరాబాద్, ప్రజాస్వరం

నగరంలో గణేష్ నిమజ్జనాలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. జీహెచ్‌ఎంసీ విడుదల చేసిన తాజా వివరాల ప్రకారం ఇప్పటివరకు 2,68,755 విగ్రహాలు నిమజ్జనం అయ్యాయి. వీటిలో ఒకటిన్నర నుంచి మూడు అడుగుల వరకు ఉన్న చిన్న విగ్రహాలు 95,782 కాగా, మూడు అడుగులకు మించి ఎత్తైన పెద్ద విగ్రహాలు 1,72,973 ఉన్నాయి. జోన్ల వారీగా చూస్తే, ఖైరతాబాద్ జోన్‌లో 63,468 విగ్రహాలు, కూకట్‌పల్లి జోన్‌లో 62,623 విగ్రహాలు నిమజ్జనం అయ్యాయి. ఈ రెండు జోన్లలోనే అత్యధిక విగ్రహాలు జలవిలీనమయ్యాయి. అలాగే శేరిలింగంపల్లి జోన్‌లో 42,899, సికింద్రాబాద్ జోన్‌లో 38,512, ఎల్బీనగర్ జోన్‌లో 37,800, చార్మినార్ జోన్‌లో 23,453 విగ్రహాలు నిమజ్జనం జరిగాయి.నిమజ్జన కార్యక్రమం సజావుగా సాగేందుకు జీహెచ్‌ఎంసీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. హుస్సేన్ సాగర్‌తో పాటు నగరంలో 20 చెరువులు నిమజ్జనానికి సిద్ధం చేశారు. అంతేకాదు, చిన్న విగ్రహాల నిమజ్జనం సులభంగా పూర్తయ్యేలా 74 ఆర్టిఫీషియల్ పాండ్స్ కూడా ఏర్పాటు చేశారు. పోలీసులు, ట్రాఫిక్ సిబ్బంది, జీహెచ్‌ఎంసీ అధికారులు సమన్వయంతో పనిచేయడంతో నిమజ్జన కార్యక్రమం ఎలాంటి ఆటంకం లేకుండా కొనసాగుతోంది

# ఐటీ సంస్థలకు కేంద్రం భరోసా

మొదటిపేజీ తరువాయి

వెళుతున్నట్లు కేంద్ర రైల్వే, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ స్పష్టం చేశారు. ఐటీ ఉద్యోగుల భవిష్యత్తుకు ఎలాంటి ముప్పు వాటిల్లకుండా చూసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆయన భరోసా ఇచ్చారు. అమెరికాలోని ట్రంప్ మద్దతుదారులు 'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్ (MAGA)' నినాదంతో అవుట్‌సోర్సింగ్‌కు వ్యతిరేకంగా గళం విప్పుతున్నారు. దీనిపై ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అశ్విని వైష్ణవ్ స్పందించారు. "భారత్‌లో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీలు), భారీ సేవా కార్యకలాపాలు నిర్వహిస్తున్న బహుళజాతి సంస్థలతో మేం నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాం. అదే సమయంలో అమెరికా, యూరప్, జపాన్, ఆగ్నేయాసియా దేశాల ప్రభుత్వాలతోనూ చర్చిస్తున్నాం. అత్యున్నత నాణ్యతతో కూడిన ఉపాధిని అందిస్తున్న ఈ కీలక పరిశ్రమ చెక్కుచెదరకుండా, మరింత వృద్ధి చెందేలా చూడటమే మా లక్ష్యం" అని ఆయన వివరించారు. ఇటీవల, ట్రంప్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో చేసిన వ్యాఖ్యలు ఈ ఆందోళనలకు మరింత ఆజ్యం పోశాయి. విదేశీ రిమోట్ వర్కర్లపై టారిఫ్‌లు (పన్నులు) విధించాలని, అమెరికాకు రిమోట్‌గా సేవలు అందించే దేశాలు కూడా వస్తువుల మాదిరిగానే పన్నులు చెల్లించాలని ఆయన సోషల్ మీడియాలో పేర్కొన్నారు. ఇది నేరుగా భారతదేశ విదేశీ మారకద్రవ్య ఆర్జనపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. భారత ఐటీ సేవల రంగంలో ప్రస్తుతం 56 లక్షల మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. దేశ ఎగుమతి ఆదాయంలో ఈ రంగం వాటా చాలా కీలకం. అయితే, కేవలం సేవల ఎగుమతులపైనే ఆధారపడకుండా ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలను కూడా బలోపేతం చేస్తోందని మంత్రి వైష్ణవ్ తెలిపారు. "దేశీయంగా ఎలక్ట్రానిక్స్ తయారీ రంగాన్ని శక్తిమంతం చేస్తున్నాం. స్మార్ట్‌ఫోన్ల తయారీలో మన వాటా గణనీయంగా పెరిగింది. ఎలక్ట్రానిక్స్‌కు సంబంధించిన అన్ని పరికరాలను ఒక్కొక్కటిగా దేశంలోనే తయారు చేసేలా సరఫరా గొలుసును స్థానికీకరిస్తున్నాం" అని ఆయన అన్నారు. ప్రస్తుతం ఉన్న ఐటీ ఉద్యోగాలను కాపాడుకుంటూనే, దేశంలోని నైపుణ్యం కలిగిన యువతకు తయారీ రంగంలో కొత్త అవకాశాలు సృష్టించడమే తమ ద్వంద్వ వ్యూహమని ఆయన స్పష్టం చేశారు. ప్రముఖ ఐటీ పరిశ్రమల సంస్థ నాస్కామ్ అంచనాల ప్రకారం, ఈ ఆర్థిక సంవత్సరంలో భారత టెక్నాలజీ రంగం 5.1 శాతం వృద్ధితో 282.6 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని ఆర్జించనుంది. 2026 ఆర్థిక సంవత్సరం నాటికి ఇది 300 బిలియన్ డాలర్ల మైలురాయిని దాటుతుందని అంచనా. ఈ రంగంలో కొత్తగా 1,26,000 ఉద్యోగాలు కూడా రానున్నాయని నాస్కామ్ తన నివేదికలో పేర్కొంది.



# రేవంత్ రెడ్డి వరాల జల్లు

మొదటిపేజీ తరువాయి

విస్తరిస్తున్న శివారు ప్రాంతాల అవసరాలను తీర్చడానికి 8,858 కోట్ల రూపాయల వ్యయంతో గోదావరి నీటి తరలింపు పథకాలను ప్రారంభించనున్నారు. ఫేస్2, ఫేస్ 3 ఇందులో ఉన్నాయి. హైదరాబాద్ కోర్ సిటీతో పాటు శివారు ప్రాంతాలకూ మంచినీటి తరలింపు మరింత సులభతరమౌతుంది. గోదావరి మంచినీటి పథకం రెండు, మూడుదశల కోసం 7,360 కోట్లు కేటాయించారు. ఈ ప్రాజెక్టు కింద మల్లన్నసాగర్ జలాశయం నుండి 20 టీఎంసీల నీటిని తీసుకుంటారు. ఇందులో 2.5 టీఎంసీలను మూసీ నది పునరుజ్జీవనం కోసం ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌లకు మళ్లిస్తారు.



మిగిలిన 17.5 టీఎంసీలు హైదరాబాద్ మంచినీటి అవసరాలకు ఉపయోగపడతాయి. ఈ క్రమంలో ఏడు మధ్యస్థ సరస్సులను కూడా గోదావరి జిలాలతో నింపుతారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ కింద చేపట్టిన ఈ ప్రాజెక్టును రెండేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అదే సమయంలో ఔటర్ రింగ్ రోడ్ మంచినీటి సరఫరా ప్రాజెక్టు మూడోదశనూ రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారు. దీనికి 1,200 కోట్లు రూపాయలు ఖర్చవుతుంది. ఈ ప్రాజెక్టు జీహెచ్‌ఎంసీ పరిధి, దాని చుట్టుపక్కల గల మునిసిపాలిటీలు, మునిసిపల్ కార్పొరేషన్లు, ఔటర్ రింగ్ రోడ్ వెంబడి ఉన్న గ్రామ పంచాయతీలకు విస్తరించి ఉంది. నిర్మించిన 71 రిజర్వాయర్లలో 15 ఇప్పుడు ప్రారంభించనున్నారు. ఇవి సరూర్‌నగర్, మహేశ్వరం, శంషాబాద్, హయత్‌నగర్, ఇబ్రహీంపట్నం, ఘట్‌కేసర్, కీసర, రాజేంద్రనగర్, షామీర్‌పేట్, మేడ్చల్, కుత్బుల్లాపూర్, రామచంద్రాపురం, పఠాన్‌చెరు, బొల్లారం సహా 14 మండలాల్లోని 25 లక్షల మందికి మంచినీటి అవసరాలను తీరుస్తాయి. కోకాపేట లేఅవుట్ అభివృద్ధి ప్రాజెక్టుకు కూడా రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. ఇది కోకాపేట లేఅవుట్, నియో పోలిస్, ఎస్ఈజెడ్లకు మంచినీరు, మురుగునీటి పారుదల నెట్‌వర్క్ ను బలోపేతం చేయడానికి ఉద్దేశించిన ప్రాజెక్టు ఇది. దీని నిర్మాణ వ్యయం 298 కోట్ల రూపాయలు. ఇది వచ్చే రెండేళ్లలో పూర్తవుతుందని అంచనా. ఈ ప్రాజెక్టు వల్ల సుమారు 13 లక్షల మందికి ప్రయోజనం చేకూరుతుంది.

# గుడ్ జాబ్.. గ్రేట్ వర్క్

హైదరాబాద్, ప్రజాస్వరం

హైదరాబాద్‌లో అత్యంత వైభవంగా కొనసాగిన వినాయకుడి నవరాత్రి ఉత్సవాలకు తెరపడింది. విఘ్న నాయకుడు నిమజ్జనానికి తరలాడు. జంటనగరాల్లో కన్నుల పండువగా గణేష విగ్రహాల శోభాయాత్రలు ముగిశాయి. పాతబస్తీ సహా అన్ని ప్రాంతాల్లో నిమజ్జనం వేడుకల సంబరాలు ఆకాశాన్నంటాయి. ఆద్యంతమూ వినాయక విగ్రహాల నిమజ్జనం సాఫీగా, అంగరంగ వైభవంగా పూర్తయ్యాయి. రెండో రోజు కూడా వినాయక విగ్రహాల నిమజ్జనం కొనసాగింది. ఈ నిమజ్జనోత్సవాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా పర్యవేక్షించారు. ఈ సాయంత్రం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. నేరుగా ట్యాంక్‌బండ్ వద్దకు చేరుకున్నారు. గ్రేటర్ హైదరాబాద్ కమిషనర్లు, నగర పోలీస్ కమిషనర్, ఇతర అధికారుతో కలిసి నెక్లెస్ రోడ్ మార్గంలో ఫుట్‌పాత్‌పై కలియతిరిగారు. ఖైరతాబాద్ బడా గణపతిని నిమజ్జనం చేసిన క్రేన్ నంబర్ 4 వద్దకు వెళ్లారు. నిమజ్జనం తీరుతెన్నులను అక్కడి అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. క్రేన్ ఆపరేటర్లతో మాట్లాడారు. విగ్రహాల నిమజ్జన సమయంలో వాళ్లు పాటించే జాగ్రత్తల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం సచివాలయం, ట్యాంక్ బండ్ వైపు కారు ఫుట్ బోర్డ్ పై నిల్చుని కలియతిరిగారు. అశేష జనావళికి అభివాదం చేస్తూ ముందుకు సాగారు. అనూహ్యంగా రేవంత్ రెడ్డి తమ మధ్యలో ప్రత్యక్షం కావడంతో ప్రజలు ఆశ్చర్యానికి గురయ్యారు. ఆయనకు షేక్ హ్యాండ్ ఇవ్వడానికి, సెల్ఫీలు దిగడానికి జనం ప్రయత్నించారు. హైదరాబాద్‌తో పాటు తెలంగాణ వ్యాప్తంగా వినాయక నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా ముగియడంపై రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తొమ్మిది రోజులపాటు భక్తులు గణ నాథుడికి భక్తిశ్రద్ధలతో పూజలుచేసి ఘన వీడ్కోలు పలికారని పేర్కొన్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా, అత్యంత భక్తిశ్రద్ధలతో శోభాయాత్ర ప్రశాంతంగా సాగడంలో అహర్నిశలు పనిచేసిన పోలీసు, మున్సిపల్, రెవెన్యూ అధికారులను అభినందించారు. మండపాలకు ఎటువంటి విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా డిస్కమ్ అధికారులు ఏర్పాట్లు చేశారని ప్రశంసించారు, రవాణా, పంచాయతీ రాజ్ ఇతర శాఖల అధికారులు, సిబ్బందికి, ఉత్సవ కమిటీల సభ్యులు, మండపాల నిర్వాహకులు, క్రేన్ ఆపరేటర్లు అందరికీ అభినందనలు తెలిపారు. హైదరాబాద్ లో లక్షలాది విగ్రహాలు క్రమపద్ధతిలో నిర్దేశిత సమయానికి ట్యాంక్‌బండ్‌తో సహా మిగతా అన్ని ప్రాంతాల్లో నిమజ్జన కార్యక్రమం సాఫీగా, ప్రశాంతంగా సాగడానికి సహకరించిన ప్రజలకు అభినందనలు తెలిపారు.




# హైదరాబాద్‌లో భారీ డ్రగ్స్ ఫ్యాక్టరీ

మొదటిపేజీ తరువాయి

- **మందుల మాటున రూ.12 వేల కోట్ల దందా!**
- **చర్లపల్లి పారిశ్రామిక వాడలో భారీ డ్రగ్స్ తయారీ కేంద్రం గుర్తింపు**
- **అత్యవసర మందుల మాటున మెఫెడ్రోన్ ఉత్పత్తి చేస్తున్న ఫ్యాక్టరీ**
- **మహారాష్ట్ర పోలీసులు, ఎన్‌సీబీ అధికారుల సంయుక్త ఆపరేషన్**
- **బంగ్లాదేశ్ యువతి సహా మొత్తం 12 మంది నిందితుల అరెస్ట్**
- **మహారాష్ట్రలో చిన్న క్లూతో బయటపడిన దేశవ్యాప్త నెట్‌వర్క్**

మొదటిపేజీ తరువాయి

నగర శివారులోని చర్లపల్లి పారిశ్రామికవాడ కేంద్రంగా నడుస్తున్న వేల కోట్ల రూపాయల విలువైన భారీ డ్రగ్స్ రాకెట్‌ను పోలీసులు ఛేదించారు. అత్యవసర మందుల తయారీ ముసుగులో ప్రమాదకరమైన మెఫెడ్రోన్ (మ్యావ్ మ్యావ్) అనే మత్తుమందును రహస్యంగా ఉత్పత్తి చేస్తున్న ఓ ఫ్యాక్టరీపై మహారాష్ట్ర పోలీసులు, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) అధికారులు సంయుక్తంగా దాడి చేసి ఒక బంగ్లాదేశ్ యువతి సహా మొత్తం 12 మందిని అరెస్ట్ చేశారు. ఈ భారీ నెట్‌వర్క్‌కు సంబంధించిన మూలాలు మహారాష్ట్రలో బయటపడ్డాయి. గత నెల 8వ తేదీన కాశీమీరా ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న బంగ్లాదేశ్‌కు చెందిన ఫాతిమా మురాద్ షేక్ అనే 23 ఏళ్ల యువతిని పోలీసులు అరెస్ట్ చేయడంతో ఈ దందా వెలుగులోకి వచ్చింది. ఆమె వద్ద నుంచి 105 గ్రాముల మెఫెడ్రోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఫాతిమాను విచారించగా రెహ్మాన్ షేక్ అనే వ్యక్తి డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్టు తేలింది. అతడిని అరెస్ట్ చేయడంతో ఇది దేశవ్యాప్త నెట్‌వర్క్ అని గుర్తించిన మహారాష్ట్ర పోలీసులు 'డెకాయ్ ఆపరేషన్' ప్రారంభించారు. నిందితుల ముఠాలోనే తమ సిబ్బందిని ప్రవేశపెట్టి మహారాష్ట్ర వ్యాప్తంగా 60 ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో పలువురు కీలక నిందితులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి కూడా మెఫెడ్రోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ దర్యాప్తులోనే డ్రగ్స్ తయారీ కేంద్రం హైదరాబాద్‌లోని చర్లపల్లిలో ఉన్నట్టు పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో శుక్రవారం స్థానిక నవోదయ కాలనీలోని 'వాగ్దేవి ల్యాబ్స్' అనే కంపెనీపై ఎన్‌సీబీ అధికారులతో కలిసి మెరుపుదాడి చేశారు. కంపెనీ యజమాని, ఐటీ నిపుణుడైన శ్రీనివాస్ విజయ్ ఒలేటితో పాటు తానాజీ పండరీనాథ్ పట్వారీని అరెస్ట్ చేశారు. ఫ్యాక్టరీలో డ్రగ్స్ తయారీకి వినియోగిస్తున్న అత్యాధునిక యంత్ర పరికరాలను గుర్తించారు. ఈ కేసులో మొత్తం 12 మందిని అరెస్ట్ చేసినట్టు మీరా భయాందర్‌వాసాయ్ విహార్ (ఎంబీవీవీ) పోలీసులు ఓ ప్రకటనలో తెలిపారు. చర్లపల్లి ఫ్యాక్టరీలో లభించిన ముడిసరుకుతో సుమారు రూ.12 వేల కోట్ల విలువైన డ్రగ్స్‌ను తయారు చేసే అవకాశం ఉందని సమాచారం.





# ఇది ప్రభుత్వ హత్యే

మొదటిపేజీ తరువాయి

ధ్వజమెత్తారు. ఈ ఘటనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క నైతిక బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు. మహేశ్ మృతి పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేసిన కేటీఆర్, ప్రభుత్వం తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. "కనీసం నెల జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం ఉండటం సిగ్గుచేటు. ప్రభుత్వ వైఫల్యం వల్లే మహేశ్ ఆత్మహత్య చేసుకున్నాడు" అని ఆయన అన్నారు. మృతుడి కుటుంబాన్ని ఆదుకునేందుకు తక్షణమే రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, మహేశ్ భార్యకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. మరోవైపు, మహేశ్ మృతిని ప్రమాదంగా చిత్రీకరిస్తూ అధికార పార్టీ నేతలు ఓ వీడియోను ప్రచారం చేస్తున్నారంటూ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నీళ్లు అనుకుని పొరపాటున పురుగుల మందు తాగాడని చెప్పించడం, తమ అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికి చేస్తున్న క్రూరమైన ప్రచారమని ఆయన విమర్శించారు. ఈ ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఆదివారం కేటీఆర్ ఆదేశాల మేరకు, బీఆర్ఎస్ నేత ఎరువ సతీశ్ రెడ్డి, ఇతర నాయకులతో కలిసి మాధవరావుపల్లిలోని మహేశ్ నివాసానికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా కేటీఆర్ ఫోన్‌లో మహేశ్ తల్లితో మాట్లాడి ఓదార్చారు. ఆరు నెలలుగా జీతం రాకపోవడంతో తన కొడుకు... భార్య, నలుగురు ఆడపిల్లలను పోషించలేక తీవ్రంగా మదనపడ్డాడని ఆమె కన్నీటిపర్యంతమయ్యారు. గతంలో వైద్యానికి డబ్బుల్లేక ఓ బిడ్డను కూడా కోల్పోయామని, ఇప్పుడు బకాయిల కోసం అడిగి అవమానం భరించలేక, పురుగుల మందు తాగి ప్రాణాలు తీసుకున్నాడని ఆమె వాపోయారు. ఆమె మాటలకు చలించిపోయిన కేటీఆర్, బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మహేశ్ కుమార్తెలకు ఆర్థిక సహాయం అందిస్తామని, రెండు రోజుల్లో సతీశ్ రెడ్డి ద్వారా ఆ సహాయాన్ని చేరవేస్తామని హామీ ఇచ్చారు. జీతాలు రాకపోవడం వల్లే తన మామయ్య ఆత్మహత్య చేసుకున్నాడని, కొందరు వ్యక్తులు బలవంతంగా ఆయనతో పొరపాటున తాగానని వీడియో రికార్డు చేయించారని మృతుడి మేనకోడలు జ్యోతి ఆరోపించడం గమనార్హం.




# దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్

- కేంద్ర ఎన్నికల సంఘం సన్నాహాలు
- దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా సమగ్ర సవరణకు ఈసీ ప్లాన్
- ఈ నెల 10న రాష్ట్రాల ముఖ్య ఎన్నికల అధికారులతో కీలక సమావేశం
- ఇంటింటి సర్వే ద్వారా ఓటర్ల వివరాల క్షుణ్ణమైన పరిశీలన
- అక్రమ వలసదారులను జాబితా నుంచి తొలగించడమే ప్రధాన లక్ష్యం
- 2026 అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈసీ ముందస్తు చర్యలు
- బీహార్ తరహాలోనే దేశమంతటా అమలుకు సన్నాహాలు

**హైదరాబాద్, ప్రజాస్వరం**

దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) భారీ కసరత్తుకు శ్రీకారం చుట్టింది. బీహార్‌లో చేపట్టిన తరహాలోనే 'ప్రత్యేక సమగ్ర సవరణ' (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని దేశమంతటా అమలు చేసేందుకు సిద్ధమవుతోంది. ఈ ప్రక్రియలో భాగంగా ఎన్నికల సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. ఈ కీలక కార్యక్రమం అమలు, విధివిధానాలపై చర్చించేందుకు ఈ నెల 10న అన్ని రాష్ట్రాల ముఖ్య ఎన్నికల అధికారులతో (సీఈఓలు) ఉన్నతస్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా జ్ఞానేశ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత సీఈఓలతో నిర్వహిస్తున్న మూడో కీలక సమావేశం ఇది. ముఖ్యంగా 2026లో తమిళనాడు, పశ్చిమ బెంగాల్, కేరళ, అస్సాం, పుదుచ్చేరి రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఓటర్ల జాబితాను 100 శాతం కచ్చితత్వంతో, పారదర్శకంగా తీర్చిదిద్దాలని ఎన్నికల సంఘం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఏడాది చివరి నాటికి దేశవ్యాప్తంగా ఈ సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ప్రారంభించే అవకాశాలు ఉన్నాయని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇటీవల బీహార్‌లో నిర్వహించిన ఎస్ఐఆర్‌పై ప్రతిపక్షాల నుంచి విమర్శలు వచ్చిన సంగతి తెలిసిందే. ఆ అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, ఈసారి దేశవ్యాప్తంగా ఈ ప్రక్రియను మరింత పకడ్బందీగా, పక్షపాతరహితంగా నిర్వహించేందుకు ఈసీ ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ముఖ్యంగా బంగ్లాదేశ్, మయన్మార్ వంటి దేశాల నుంచి వలస వచ్చి అక్రమంగా ఓటరు జాబితాల్లో చేరిన వారిని గుర్తించి తొలగించడం ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశాలలో ఒకటి. ఓటర్ల జాబితా సమగ్రతను కాపాడటంతో పాటు, బోగస్ ఓట్లకు పూర్తిగా అడ్డుకట్ట వేయాలని ఈసీ భావిస్తోంది. ఈ బృహత్తర కార్యక్రమం విజయవంతం కావాలంటే రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగాల పూర్తి సహకారం అత్యంత అవసరమని అధికారులు స్పష్టం చేస్తున్నారు.



# దసరా, దీపావళికి స్పెషల్ ట్రైన్స్

- 122 ప్రత్యేక రైళ్లు ప్రకటించిన రైల్వే శాఖ
- సెప్టెంబర్ 10 నుంచి డిసెంబర్ 3 వరకు అందుబాటులో
- మధురై, చెన్నై, బెంగళూరు సహా పలు మార్గాల్లో రైళ్లు
- వివరాల కోసం అధికారిక వెబ్‌సైట్ చూడాలని సూచన

**హైదరాబాద్, ప్రజాస్వరం**

దసరా, దీపావళి పండుగల సీజన్‌లో ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు దక్షిణ మధ్య రైల్వే సిద్ధమైంది. ఈ మేరకు ప్రయాణికులకు శుభవార్త చెబుతూ భారీ సంఖ్యలో ప్రత్యేక రైళ్లను ప్రకటించింది. పండుగల కోసం సొంత ఊళ్లకు వెళ్లేవారి సౌకర్యార్థం మొత్తం 122 ప్రత్యేక రైలు సర్వీసులను నడపనున్నట్టు రైల్వే శాఖ అధికారులు ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈ ప్రత్యేక రైళ్లు సెప్టెంబర్ 10వ తేదీ నుంచి డిసెంబర్ 3వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. పండగల సమయంలో సాధారణ రైళ్లలో రద్దీ విపరీతంగా పెరిగిపోతున్న నేపథ్యంలో అదనపు ప్రయాణికుల తాకిడిని నివారించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ ప్రత్యేక రైళ్లు పలు కీలక నగరాల మధ్య రాకపోకలు సాగిస్తాయి. రైల్వే శాఖ ప్రకటించిన వివరాల ప్రకారం, మధురైబరౌని మధ్య 12, ఎంజీఆర్ చెన్నై సెంట్రల్‌బరౌని మధ్య 12, షాలిమార్‌ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ మధ్య 10 రైళ్లు నడుస్తాయి. అదేవిధంగా, ఎస్ఎంవీటీ బెంగళూరుబీదర్ మధ్య 9, తిరునెల్వేలిశివమొగ్గ టౌన్ మధ్య 8 సర్వీసులు ఏర్పాటు చేశారు. వీటితో పాటు తిరువనంతపురం నార్త్‌సంత్రాగచి మధ్య 7, ఎంజీఆర్ చెన్నై సెంట్రల్‌సంత్రాగచి మధ్య 3 రైళ్లు కూడా నడుస్తాయని అధికారులు వివరించారు. ఈ రైళ్ల సమయాలు, ఆగే స్టేషన్లు, టికెట్ లభ్యత వంటి పూర్తి వివరాల కోసం ప్రయాణికులు రైల్వే అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.





# శ్రీరామ్ నగర్ కాలనీ వినాయకుని లడ్డు వేలం పాట

- 53600 రూపాయలకు దక్కించుకున్న మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్

**జవహర్ నగర్, సెప్టెంబర్ 7,( ప్రజాస్వరం ):**

జవహర్ నగర్ మునిసిపల్ కార్పొరేషన్ 12 వ డివిజన్ శ్రీ రామ్ నగర్ కాలనీ పోచమ్మ దేవాలయం వద్ద ఏర్పాటుచేసిన గణేష్ మండపం లో ఆదివారం వినాయక నిమజ్జనం సందర్భంగా లడ్డు వేలంపాటను నిర్వహించారు. లడ్డు వేలం పాటలో పాల్గొన మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్ 53,600 రూపాయల కు లడ్డును దక్కించుకున్నారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వామివారికి తొమ్మిది రోజులు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించిన లడ్డును తగ్గించుకోవడం ఆనందంగా ఉందన్నారు ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆ భగవంతుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో మేయర్ శాంతి కోటేశ్వరరావు కుటుంబ సభ్యులతో, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు

# స్థానిక సమరమే లక్ష్యంగా సభ

**మొదటిపేజీ తరువాయి**

స్థానిక ఎన్నికల ప్రచారానికి శంఖారావం పూరించాలని భావిస్తోంది. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యలను ముఖ్య అతిథులుగా ఆహ్వానించనున్నారు. లక్ష మందికి పైగా జనసమీకరణ చేసి, ఈ సభను విజయవంతం చేయాలని రాష్ట్ర నాయకత్వం లక్ష్యంగా పెట్టుకుంది. సభా నిర్వహణ ఏర్పాట్లపై చర్చించేందుకు శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ నివాసంలో ముఖ్య నేతలు సమావేశమయ్యారు. ఈ భేటీలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క పాల్గొని జన సమీకరణ, సభా ఏర్పాట్లపై చర్చించారు. దీనికి కొనసాగింపుగా ఆదివారం కామారెడ్డి పట్టణంలో మరో ముఖ్యమైన సన్నాహక సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాతో పాటు సమీపంలోని కరీంనగర్, మెదక్, సిద్దిపేట జిల్లాల మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డీసీసీ అధ్యక్షులు పాల్గొంటారు. అనంతరం పీసీసీ అధ్యక్షుడు, మంత్రులు సభ నిర్వహణకు అనువైన స్థలాన్ని పరిశీలించనున్నారు.

**కామారెడ్డి వేదికనే ఎందుకు ఎంచుకున్నారంటే?**

గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కామారెడ్డి నుంచి రేవంత్ రెడ్డి పోటీ చేశారు. ఆ సమయంలో కామారెడ్డిలో జరిగిన కాంగ్రెస్ సభలోనే కర్ణాటక సీఎం సిద్ధరామయ్య 'బీసీ డిక్లరేషన్' ప్రకటించారు. అధికారంలోకి వస్తే కులగణన చేపట్టి, బీసీలకు రిజర్వేషన్లు పెంచుతామని హామీ ఇచ్చారు. ఆ హామీకి అనుగుణంగానే, రాష్ట్రంలో కులగణన చేపట్టి బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ ప్రభుత్వం ఆర్డినెన్స్‌ను గవర్నర్ ఆమోదానికి పంపింది. ఏ వేదికపై అయితే హామీ ఇచ్చారో, అదే వేదికపై నుంచి విజయోత్సవ సభ జరపడం ద్వారా బీసీ వర్గాలకు బలమైన సందేశం పంపవచ్చని కాంగ్రెస్ భావిస్తోంది.

# నరక కూపాలుగా గురుకులాలు

**మొదటిపేజీ తరువాయి**

294 నుంచి 1024కి, విద్యార్థుల సంఖ్యను లక్షా 90 వేల నుంచి ఆరున్నర లక్షలకు పెంచి నాణ్యమైన విద్యను అందించారు. విద్యపై పెట్టే ఖర్చును ఆయన పెట్టుబడిగా భావించారు. కానీ, కాంగ్రెస్ 22 నెలల పాలనలో గురుకులాల ఖ్యాతి అధఃపాతాళానికి పడిపోయింది" అని ఆరోపించారు. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి గాడితప్పిన గురుకుల వ్యవస్థను చక్కదిద్దాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరించడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న సిబ్బంది జీతాలను వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు.




# ఉద్యోగ భద్రత కల్పించాలి

- ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల పై ఆడిట్ పేరుతో లక్షల్లో రికవరీలు, సస్పెన్షన్లు విధించడం సమంజసం కాదు!
- ఏపీ ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ సిఐటియు రాష్ట్ర కార్యదర్శి, కె. ఉమామహేశ్వరరావు డిమాండ్

**మన్యం జిల్లా : సెప్టెంబర్ 7**
**( ప్రజా స్వరం )**

ఆదివారం పార్వతీపురం గిరిజన సామాజిక భవనాం లో ఫీల్డ్ అసిస్టెంట్ లా 1వ జిల్లా మహాసభ మండింగి హరినాథ అధ్యక్షతన జరిగిన మహాసభలో *రాష్ట్ర కార్యదర్శి,కె. ఉమామహేశ్వరరావు,సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మ్ ల మన్మధరావు,న్ వై నాయుడు, మాట్లాడుతూ... ఇటీవల సోషల్ ఆడిట్ పేరుతో ఫీల్డ్ అసిస్టెంట్లను మానసికంగా ఆర్థికంగా వేధింపులకు గురి చేస్తున్నారని, వేతన దారుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు లేకపోయినా చిన్న చిన్న సాంకేతిక కారణాలు చూపించి లక్షల్లో రికవరీలు, సస్పెన్షన్లు విదించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు!.. గత 20 సంవత్సరాలుగా ఇదే వృత్తిలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత ,ఈఎస్ఐ, పీఎఫ్ కల్పించకుండా మండేస్ పేరు తో ప్రభుత్వాలు తీవ్ర అన్యా చేస్తున్నాయని, రిజిస్టర్లు ఇవ్వడం లేదు పేపర్లు స్టేషనర్ ఖర్చులు భరించవలసి వస్తుంది ఏడు రికార్డులకు 5000 రూపాయలు ఖర్చు అవుతుంది ఫీల్డ్ అసిస్టెంట్లు చెయ్యికోడని యాప్ పని కూడా చేయిస్తున్నారు అని . ఫీల్డ్ అసిస్టెంట్లు అనేకమంది ఉన్నత చదువులు చదివిన వారిని, అలాంటి వారికి కేవలం 5740 రూ..ల నెల వేతనం ఇచ్చి జీవితానికి ఎలాంటి భరోసా లేకుండా చేయడం,ఈ రకంగా వేధించడం ఎంతవరకు సమంజ సమని ప్రశ్నించారు! ఇప్పటికైనా ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలని లేనియెడల సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు! డిసెంబరు 31, జనవరి 1,2,3,4, ఆల్ ఇండియా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు అనంతరం కమిటీ ఎన్నుకోవడం జరుగుతుంది.కార్యక్రమంలో కార్యదర్శి వెంకట్రావు, సింహాచలం, తులసి, సంగం నాయుడు, ఆదినారాయణ, ప్రసాద్, , తదితరులు పాల్గొన్నారు



# ప్రభుత్వ వైద్య కళాశాలను ప్రభుత్వమే నిర్వహించాలి

- ప్రైవేట్ భాగస్వామ్య నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి
- ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం సిపిఎం పార్టీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వా నికి డిమాండ్

**మన్యం జిల్లా : సెప్టెంబర్ 7 ( ప్రజా స్వరం )**

కొమరాడ మండల కేంద్రంలో ఈరోజు అనగా ఆదివారం కేంద్ర ప్రభుత్వం సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం మన రాష్ట్రంలో 10ప్రభుత్వ వైద్య కళాశాల లు పి పి పి పద్ధతిలో నిర్మించుటకు ప్రతిపాదనలు చేయడం జరిగిందని అయితే వీటి యొక్క నిర్మాణం ప్రైవేట్ భాగస్వామ్య నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సిపిఎం పార్టీ మరియు ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం ఆధ్వర్యంలో కొమరాడ మండల కేంద్రంలో పత్రిక విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది ఈ సందర్భంగా పత్రిక విలేకరులతో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులకు ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం నాయకులు లక్ష్మయ్య మాట్లాడుతూ ఈరోజు కూటమి ప్రభుత్వ వైద్య రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని జోడిస్తూ టిడిపి క్యాబినెట్ చేసిన నిర్ణయాన్ని సిపిఎం పార్టీ తీవ్రంగా ఖండిస్తూ కేంద్ర బిజెపి ప్రభుత్వ నిర్ణయాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం పాలన చేపడుతుందని ఇది ప్రభుత్వ అస్మార్థతనానికి నిదర్శనమని పేర్కొన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వ వైద్య రంగాన్ని ప్రైవేట్ కరించే భాగంలోనే టిడిపి క్యాబినెట్ నిర్ణయం చేపట్టిందని తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించి సామాన్య ప్రజలకు ప్రభుత్వ వైద్యను దూరం చేసిందని అన్నారు. చంద్రబాబు ప్రభుత్వం మోడీ నిర్ణయాలను వ్యతిరేకించి రాష్ట్ర ప్రజల నిర్ణయాలకు కట్టుబడి ఉండాలని, వెంటనే ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఈ సందర్భంగా కోరుతున్నాము ఇలాంటి సందర్భంలో కొత్తగా మంజూరైన వైద్య కళాశాలల నిర్మాణాన్ని, నిర్వహణను ప్రభుత్వం ఆధ్వర్యంలోనే చేపట్టాలని కోరారు. వైద్య విద్యను అభ్యసించే విద్యార్థుల అవసరాలకు తగినట్లుగా వైద్య కళాశాలల్లో సీట్లు పెంచేందుకు జాతీయ వైద్య మండలిపై ఒత్తిడి తేవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన వైద్య కళాశాలలను పిపిపి విధానంలో చేపట్టేందుకు ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసిందన్నారు. ప్రజల ఆరోగ్య హక్కును పరిరక్షించడంలో ప్రభుత్వ జవాబుదారీతనంపై ఇది తీవ్ర ప్రభావాన్ని చూపుతుందన్నారు. మరోవైపు ప్రైవేటు వైద్య కళాశాలల్లో విచ్చలవిడిగా జరుగుతున్న అవినీతిని సిబిఐ ఇటీవల బహిర్గతం చేసిన నేపథ్యంలో ప్రజాప్రయోజనాలను కాపాడటానికి ఈ ప్రైవేటీకరణ ప్రతిపాదనను తక్షణమే వెనక్కి తీసుకోవాలని సిపిఎం ఈ విషయంపై అనేక పర్యాయాలు తన ఆందోళనను వ్యక్తం చేసిందన్నారు. జాతీయ, రాష్ట్ర నిపుణులు, మేధావులు, ప్రజలు ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను తీవ్రంగా వ్యతిరేకించాలని కోరారు. వైద్య విద్యను ప్రైవేటీకరించడం వల్ల పేదల వర్గాలకు చెందిన విద్యార్థులకు వైద్య విద్య అందని ద్రాక్షగా మిగిలిపోతుందన్నారు. ప్రైవేటు సంస్థలకు ప్రభుత్వ వైద్య కళాశాలల నియంత్రణను అప్పగించడం వల్ల ఫీజులు అధికమవడం, జవాబుదారీతనం తగ్గడం, సేవ కంటే ఆదాయానికే ప్రాధాన్యత ఇవ్వడంతో పేద విద్యార్థులకు విద్య, రోగులకు వైద్యం అందుబాటులో ఉండవని స్పష్టం చేశారు. ఇప్పటికైనా ఈ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం మానుకోవాలని లేని యెడల మన్యం జిల్లా ప్రజల అందరితో కలిసి రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించుకుంటున్నాం ఈ కార్యక్రమంలో సుబ్బారావు గౌర్నాయుడు పాల్గొన్నారు.

# షబ్బీర్ అలీ కాన్వాయ్‌కు తప్పిన పెను ప్రమాదం!

**కామారెడ్డి సెప్టెంబర్ 07(ప్రజాస్వరం):** షబ్బీర్ అలీ కాన్వాయ్‌కు పెను ప్రమాదం తప్పింది. ఈ నెల 15న జరగనున్న బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించేందుకు కామారెడ్డి కి వచ్చిన మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ లు వచ్చారు. అయితే... హైదరాబాద్ తిరుగు ప్రయాణంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ వాహనానికి పెను ప్రమాదం తప్పింది. డ్రైవర్ చాకచక్యంతో నలుగురి ప్రాణాలతో బయటపడ్డారు. వేగంగా వెళ్తున్న కాన్వాయ్ లోకి అడ్డంగా కారు ఓ కారు వచ్చింది. అయితే దానిని తప్పించబోయి



డివైడర్ తగిలి షబ్బీర్ అలీ కారుకు పెను ప్రమాదానికి గురైంది. షబ్బీర్ అలీ కారు బుల్లెట్ ప్రూఫ్ కావడంతో చిన్నగా డ్యామేజ్ అయింది. కాగా ఈ ప్రమాదంలో ఎవరు కూడా గాయపడలేదు.

# చంద్రగ్రహణం సందర్భంగా శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయం మూసివేత

**శంకర్‌పల్లి సెప్టెంబర్ 07(ప్రజాస్వరం):** చంద్రగ్రహణం సందర్భంగా శంకర్‌పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామంలో గల 11వ శతాబ్దానికి చెందిన శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయాన్ని ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు మూసివేశారు. మధ్యాహ్నం గం. 12లకు ఆలయంలో స్వామి వారికి మహానువేదన మంగళనీరాజనం భజన కార్యక్రమాలు పూర్తి చేసి ప్రత్యేక పూజలు చేసి ద్వార బంధనం చేశారు. తిరిగి సోమవారం ఉదయం గం. 5లకు సంప్రోక్షణ, తిరుమంజనము పూజల అనంతరం భక్తులకు సర్వదర్శనాలు, అర్జిత సేవలు యథావిధిగా కొనసాగుతాయని అర్చకులు తెలిపారు.



# శ్రీశైలం మల్లన్న సన్నిధిలో ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్

**హైదరాబాద్ సెప్టెంబర్ 07(ప్రజాస్వరం):** భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్ కుమార్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయం రాజగోపురం వద్ద శ్రవణ్‌కు అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదల ప్రకారం ఘన స్వాగతం పలికారు. అనంతరం మల్లికార్జున స్వామి, అలాగే, భ్రమరాంబ అమ్మవారలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా శ్రీ స్వామి అమ్మవార్లను దర్శించుకున్నట్లు చెప్పారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా.. అధికారులు స్వామి అమ్మవార్ల శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలు, జ్ఞాపిక అందజేసి సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, సతీమణి శోభమ్మ దంపతులకు ఆశీస్సులు ఉండాలని భ్రమరాంబ మల్లికార్జున స్వామిని వేడుకున్నట్లు తెలిపారు. ఎంతటివారైనా కేసీఆర్ ముందు బాలాదూరేనంటూ కవితపై పరోక్షంగా విమర్శించారు. సంక్షోభాలు, సమస్యలు అధిగమించి మూడోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారన్నారు. ప్రభుత్వ వైఫల్యం, ముందు చూపు లేకపోవడంతో రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడిందన్నారు. ఆంధ్రప్రదేశ్ దేవాలయాల్లో ట్రస్ట్ బోర్డులో మెంబ




ర్లుగా తెలంగాణ వాళ్లకు కూడా అవకాశం ఇస్తే బాగుంటుందన్నారు. వచ్చే ఎన్నికల్లో కెసిఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అయితే శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున అమ్మవార్ల దర్శనానికి తీసుకువస్తానన్నారు.

# నేడే సీపీగెట్ ఫలితాలు విడుదల.. చెక్ చేసుకోండి ఇలా..

**హైదరాబాద్ సెప్టెంబర్ 07(ప్రజాస్వరం):**

రాష్ట్రంలోని తొమ్మిది యూనివర్సిటీల్లో ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ తదితర కోర్సుల్లో ప్రవేశానికి ఉస్మానియా యూనివర్సిటీ సీపీగెట్ నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ సీపీగెట్ ఫలితాలను సోమవారం ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి విడుదల చేయనున్నారు. ఈ ఫలితాల విడుదలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆగస్టు 6 నుంచి 11 వరకు నిర్వహించిన ఈ పరీక్షలకు 45,477 మంది హాజరైనట్టు అధికారులు వెల్లడించారు. ఉస్మానియా, తెలంగాణ, పాలమూరు, మహాత్మాగాంధీ, శాతవాహన, కాకతీయ, చాకలి ఐలమ్మ, జేఎన్టీయూ యూనివర్సిటీల్లో 32 సబ్జెక్టుల్లో ప్రవేశాలకు సీపీగెట్ నిర్వహించారు. ఫలితాలను తెలుసుకునేందుకు హాల్ టికెట్ నంబర్, రిజిస్ట్రేషన్ నంబర్, పుట్టిన తేదీ తప్పనిసరి. ఫలితాల కోసం ఈ లింక్‌ను క్లిక్ చేయండి.




https://cpget.tgche.ac.in/

# భారత్ లో సంపూర్ణ చంద్రగ్రహణం

- ఆదివారం రాత్రి 9:50 గంటలకు మొదలు
- రాత్రి 1:31 గంటలకు ముగింపు
- కొన్ని ప్రాంతాల్లో బ్లడ్ మూన్‌గా దర్శనం
- ఎరుపు రంగులో కనువిందు చేసిన చంద్రుడు


**హైదరాబాద్ సెప్టెంబర్ 07(ప్రజాస్వరం):** ఆకాశంలో ఓ అద్భుతమైన ఖగోళ పరిణామం చోటుచేసుకుంది. భారతదేశ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో సంపూర్ణ చంద్రగ్రహణం ప్రారంభమైంది. ఈ గ్రహణం సమయంలో చంద్రుడు కొన్నిచోట్ల పూర్తి ఎరుపు రంగులో దర్శనమివ్వనుండటం విశేషం. దీన్నే ఖగోళ శాస్త్ర పరిభాషలో 'బ్లడ్ మూన్' అని పిలుస్తారు. ఈ అరుదైన దృశ్యం ప్రజలను ఎంతగానో ఆకట్టుకోనుంది. వివరాల్లోకి వెళితే, భారత కాలమానం ప్రకారం ఆదివారం రాత్రి 9 గంటల 50 నిమిషాలకు ఈ చంద్రగ్రహణం మొదలైంది. ఇది అర్ధరాత్రి దాటి సోమవారం తెల్లవారుజామున 1 గంట 31 నిమిషాల వరకు కొనసాగుతుందని నిపుణులు తెలిపారు. సుమారు మూడున్నర గంటల పాటు ఈ గ్రహణం వీక్షించేందుకు అవకాశం ఉంది. దేశంలోని వివిధ ప్రాంతాల ప్రజలు ఈ ఖగోళ అద్భుతాన్ని ఆసక్తిగా తిలకిస్తున్నారు. ముఖ్యంగా బ్లడ్ మూన్ దృశ్యంపై



ప్రజల్లో ప్రత్యేక ఆసక్తి నెలకొంది. గ్రహణం ప్రారంభం నుంచి ముగిసే వరకు చంద్రుడి స్థితిలో మార్పులను గమనించవచ్చు.

# ఒకే రోజు పది మంది ఉపాధ్యాయులు డుమ్మా..

**మిడ్జిల్ సెప్టెంబర్ 07(ప్రజాస్వరం):** ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఒకేరోజు ఉపాధ్యాయులు పదిమంది విధులకు గైరాజార్ పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా స్థానిక నాయకులు సమావేశం ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయులు ముందస్తు సమాచారం లేకుండా శనివారం పాఠశాల సమయంలోనే ఆరు మంది ఉపాధ్యాయులు సెలవు కోరినట్లు, మరో ముగ్గురు తో పాటు పాఠశాల హెడ్ మాస్టర్ సరస్వతి కూడా పాఠశాలకు రాలేదు. రోజురోజుకు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గుముఖం పట్టింది. ప్రజా పాలనలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి ఆశయాలకు ఉపాధ్యాయులు తూట్లు పొడుస్తున్నారు. పాఠశాలలో విద్యార్థులు 380 మంది విద్యార్థులకు 150 నుంచి 180 మధ్యలో విద్యార్థులు పాఠశాలకు వస్తున్నారు. ఉపాధ్యాయులలో సమన్వయం లోపంతో ప్రభుత్వ పాఠశాల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ఒకేరోజు పదిమంది ఉపాధ్యాయులు రాకపోతే విద్యార్థులకు తరగతి గదిలో విద్యా బోధన ఎలా సాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు తమ విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న ఉపాధ్యాయులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి




పాఠశాలను తనిఖీ చేసి బాధ్యుల పైన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు, నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

# ఎన్ని ప్రమాదాలు జరిగినా పట్టించుకోని అధికారులు

- మున్సిపల్ అధికారుల వలె జనవాడ గ్రామానికి పెను ప్రమాదాలు.
- జన్వాడ గ్రామంలో విద్యుత్ పనుల కోసం బావి పక్కన గుంత.
- మున్సిపల్ అధికారుల వల్లే ఈ ప్రమాదాలు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.
- పక్కనే ఉన్న ఫిరంగినాల, మహిళా భవనం వైపు బావి కులుతోందని ఆరోపణలు.
- దయచేసి మా సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.






**శంకర్ పల్లి, సెప్టెంబర్ 07(ప్రజాస్వరం):** రంగారెడ్డి జిల్లా, నార్సింగి మున్సిపల్ పరిధిలోని జన్వాడ వార్డులో గత 15 రోజుల ముందు విద్యుత్ పోలు వేసే క్రమంలో భారీగా బావి పక్కన గుంత చేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో లోతు ఎక్కవడంతో కాంక్రీట్ తో పూడిచారు. అనంతరం కొన్ని రోజుల క్రితం పక్కనే ఉన్న 10 నుండి 12 ఫీట్ల లోతుగా మారింది. సంబంధిత మున్సిపల్ అధికారులు వచ్చి తనిఖీ చేసి పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేయడంతో ఇప్పుడు ఆ బాయి పూర్తిగా కూలిపోయింది. ఆ పక్కనే ఉన్న ఫిరంగినాల మరియు మహిళా భవనం వైపు ఈ బావి కులుతూ వస్తుంది. దీంతో చుట్టుపక్కల ఉండే స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. గతంలో ఈ బావి గ్రామం యొక్క తాగునీరు కోసం వినియోగించేవారని ఇప్పుడు కొంతమంది అధికారులు మరియు రాజకీయ నాయకుల నిర్లక్ష్యంతో ఇలా జరగడం పట్ల స్థానికులు ఎంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రమాదాలకు మున్సిపల్ అధికారులే కారణమని గ్రామస్తులు తెలుపుతున్నారు. కాబట్టి సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఆ బావ యొక్క మరమ్మత్తులు చేసి ఆ బావికి పునర్ వైభవం తీసుకురావాలని మళ్ళీ ఆ బావి ఒక గుర్తింపు పదిలంగా ఉండేలా మళ్లీ చొరవ తీసుకోవాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

# దళిత బాలికపై అత్యాచారం..

**డయల్ 100కు ఫోన్ చేసిన మైనర్ బాలిక**

**యాచారం సెప్టెంబర్ 07(ప్రజాస్వరం):** దళిత మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడగా మరొకరు ఆ దాడికి ఒడిగట్టడంతో బాలిక 100 నెంబర్ కు ఫోన్ చేయడంతో ఈ దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసులు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని నందివనపర్తి గ్రామంలో వినాయక నిమజ్జనం చేస్తుండగా.. అక్కడికి వెళ్లిన మైనర్ దళిత బాలికను అదే గ్రామానికి చెందిన గడలా క్రాంతి కుమార్, (27) బాషా మోని క్రాంతి, (24) మీ తల్లికి యాక్సిడెంట్ అయ్యిందని తెలిపారు. అక్కడికి తీసుకెళ్తామంటూ ద్విచక్ర వాహనంపై ఎక్కించుకొని నందివనపర్తి, తాటిపర్తి, గ్రామాల మధ్యన హనుమాన్ దేవాలయం వెనకాల ఉన్న ఓ గెస్ట్ హౌస్ కి తీసుకువెళ్లి బాలికపై గడలా క్రాంతి కుమార్, (27) లైంగిక దాడికి పాల్పడ్డాడు అనంతరం బాషా మోని క్రాంతి, (24) బెదిరించి అత్యాచారయత్నానికి ప్రయత్నించడంతో బాలిక తన వద్ద ఉన్న ఫోన్ తో 100 నెంబర్ కు డైల్ చేసింది. దీంతో వెంటనే పోలీసులు రావడంతో అక్కడి నుంచి ఇద్దరు పరారయ్యారు. మైనర్ బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని



ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాలికను చికిత్స కోసం హైదరాబాదులోని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

# మంచిరేవులలో ఆదిమానవుని ఆనవాళ్లు

**రాజేంద్రనగర్ సెప్టెంబర్ 07(ప్రజాస్వరం):** నగర శివారులోని నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని మంచిరేవుల గ్రామంలో ఆదిమ మానవుని ఆనవాళ్లు కనిపించాయని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్, సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి తెలిపారు. మూసి పరిసరాల్లో ఆదివారం జరిపిన పురావస్తు అన్వేషణలో భాగంగా స్థానిక వీరభద్రాలయ వంశపారంపర్య అర్చకులు మాడపాటి పరమేశ్వర సమాచారంతో ఆలయ ప్రాంగణంలోని రాతి పరుపుపై దాదాపు 15చోట్ల కొత్తరాతి యుగం(సా.శ.పూ.4000 సం) నాటి రాతి గొడ్డళ్లను పదును పెట్టేందుకు నూరిన (అరగదీసిన) గాళ్లు(గ్రూవ్స్) ఉన్నాయని పేర్కొన్నారు. అవి 15 సెంటీమీటర్ల పొడవు, 3 సెంటీమీటర్లు వెడల్పు, 2 సెంటీమీటర్లు లోతు ఉన్నాయని ఆయన అన్నారు. మూసి ఒడ్డునున్న వీరభద్రాలయ చుట్టుపక్కల గల రాతి చరియల కింద గుహల్లోను కొత్త రాతియుగం వారు నివసించారని, జంతువుల వేట, పశుపోషణ, కొద్దిపాటి వ్యవసాయానికి మూసి నీటి వనరులతో జీవనం సాగించారని తెలియజేశారు. ఈ ఆనవాళ్లు హైదరాబాద్ నగర చరిత్రను 6000 సంవత్సరాల పూర్వానికి తీసుకువెళుతున్నాయని శివనాగిరెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐడీసీ, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్ బందా, సమతా మూర్తి శిల్పి



డిఎస్ వి ప్రసాద్, స్థపతి, రాఘవేంద్ర సాగర్ పాల్గొన్నారు. కొత్త రాతి యువకుల ఆనవాళ్లు చారిత్రక వివరాలతో పేరు పలకలను ఏర్పాటు చేసి, మంచిర్యాలను పురావస్తు పర్యాటక స్థావరంగా తీర్చిదించవచ్చని నార్సింగి ఆయన మున్సిపాలిటీ అధికారులకు శివనాగిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

# మోసం చేసిన సర్కారు... తాడోపేడో తెల్చుకుందాం:మంద కృష్ణ మాదిగ

**రామచంద్రాపురం సెప్టెంబర్ 07(ప్రజాస్వరం):**

ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా పింఛన్ల పెంపు తక్షణమే అమలు చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు, మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. కొల్లూరులోని బీఆర్జీ ఫంక్షన్ హాల్లో 'చల్లో కొల్లూరు మహా గర్జన' పేరుతో ప్రజా సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులు, నిరాశ్రయ మహిళలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలన్నారు. కాంగ్రెస్ నేతృత్వంలోని రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చి 21 నెలలు పూర్తయ్యాయన్నారు. ఆయన విజయం కుటుంబం, సామాజిక వర్గం వేసిన ఓట్లు కారణం కాదన్నారు. 55 లక్షల పేద ప్రజలు పింఛన్ల పై నమ్మకంతో వేసిన ఓట్లే ఆయన గెలుపునకు కారణమన్నారు. ఎన్నికల ముందు 45 లక్షల మంది పింఛన్‌దారులు ఉన్నారన్నారు. అప్పటి నుంచి మరో 10 లక్షల మంది అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో దివ్యాంగులకు రూ.6,000, వృద్ధులు, వితంతువులు, నిరాశ్రయ మహిళలు, ఒంటరి మహిళలకు రూ.4,000 పింఛన్ అందిస్తామని హామీ ఇచ్చారన్నారు. గత ప్రభుత్వం నుంచి పెండింగ్‌లో ఉన్న 10 లక్షల మంది దరఖాస్తుదారులకు కూడా ఈ పరిహారం వర్తిస్తుందని, డిసెంబర్ 9, 2023 నుంచి ఆ డబ్బును నేరుగా పింఛన్‌దారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి ఇంత కాలం అయినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని అసెంబ్లీలో గానీ, వెలుపల గానీ ప్రతిపక్ష పార్టీలు, నాయకులు మాట్లాడకపోవడం శోచనీయం అన్నారు. తమ మేనిఫెస్టోలో కూడా రూ.6,000 పింఛన్ హామీ ఇచ్చిన బీఆర్ఎస్ పార్టీ




కూడా దీనిపై ఒత్తిడి చేయడం లేదని విమర్శించారు. ప్రభుత్వానికి తమ వాగ్దానాలు నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రతిపక్షాలకు ప్రశ్నించే హక్కు ఉందని పేర్కొన్నారు అయినా, అటు అధికార పక్షం, ఇటు ప్రతిపక్షం రెండూ తమ బాధ్యతలలో విఫలమయ్యాయన్నారు. రేవంత్ రెడ్డి పింఛన్లు పెంచలేదన్నారు. కేసీఆర్ డిమాండ్ చేయడం లేదన్నారు. సోనియా గాంధీ పుట్టిన రోజున పెంచిన పింఛన్లు జమ చేస్తామని రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ ఓట్లు గెలవడానికి చేసిన రాజకీయ స్టంట్ తప్ప మరేమీ కాదన్నారు. తనను నమ్మి ఆశలు పెట్టుకున్న 55 లక్షల మందికి ద్రోహం చేసినట్టేనన్నారు. ఇది పేద కుటుంబాల నుంచి వచ్చిన పింఛన్దారుల పోరాటం అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ ఇద్దరికి ఈ బాధ తెలియడం లేదన్నారు. పింఛన్ పై ఆధారపడిన కుటుంబం నుంచి వచ్చిన వాడిని కాబట్టి ఈ బాధను అర్థం చేసుకున్నామన్నారు. అందుకే జూలై 15 నుంచి తెలంగాణలోని గ్రామ గ్రామాన పర్యటిస్తున్నానని తెలిపారు. ఇకపై ఆందోళన తీవ్రతరం చేస్తామన్నారు. తెలంగాణలోని 33 జిల్లాల్లో ధర్నా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. రాబోయే రోజుల్లో హైదరాబాద్ విజయవాడ రహదారిని దిగ్బంధిస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి కొల్లూరు గ్రామ అధ్యక్షులు వై ప్రమోద మాదిగ మాట్లాడుతూ చిన్నారుల గుండె సమస్యలపై పోరాటం చేసిన మహానుభావుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. పింఛన్ పెంపును ఇక ఎంత మాత్రం ఉపేక్షించడానికి వీల్లేదన్నారు. ఈ మహా గర్జనలో తెలంగాణ నుంచి భారీగా ప్రజలు తరలి వచ్చారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి ఎంఆర్పీఎస్, ఎంఎస్పీ ఇన్చార్జ్ వీఎస్ రాజు మాదిగ నియోజకవర్గం లోని వికలాంగులు ,ఒంటరి మహిళలు తదితర పెన్షన్ దారులు పాల్గొన్నారు.

# బీసీ సభతో రాష్ట్ర రాజకీయాలకు మలుపు

- కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కవిత వ్యాఖ్యలపై విమర్శలు
- సీబీఐ దర్యాప్తు తప్పుదారి పట్టించేందుకు కేసీఆర్ – కవిత డ్రామా: మహేష్
- బీజేపీ సమరభేరి.. బీఆర్ఎస్ భవిష్యత్తు లేదన్న మహేష్ గౌడ్

**కామారెడ్డి, ప్రజాస్వరం :**



కామారెడ్డి జిల్లాలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన బీసీ సభ ఘనంగా జరిగింది. ఈ సభ బీజేపీకి కనువిప్పు కలిగించేలా, రాష్ట్ర రాజకీయాలకు మలుపు తిప్పేలా నిలుస్తుందని బీజేపీ నేత మహేష్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "కేసీఆర్ పాలనలో రాష్ట్రం అప్పుల బారిన పడింది. కాళేశ్వరం ప్రాజెక్ట్ పేరుతో భారీ దోపిడి జరిగింది. ఈ విషయాన్ని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుమార్తె కవిత స్వయంగా ఒప్పుకోవడం చాలా ఆశ్చర్యకరం. వాటా లో తేడా కారణంగానే కవిత నిజం చెబుతున్నట్లు అర్థమవుతోంది" అన్నారు.అలాగే మహేష్ కుమార్ గౌడ్ మరింత తీవ్ర వ్యాఖ్యలు చేస్తూ, "బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కవిత దోపిడీ గురించి చెప్పి ఉంటే సన్మానించేవాళ్లం. కానీ ఇప్పుడు ఆమె వ్యాఖ్యలు అనుమానాస్పదంగా ఉన్నాయి. కాళేశ్వరం కేసులో సీబీఐ దర్యాప్తును తప్పుదారి పట్టించేందుకు కేసీఆర్ - కవిత డ్రామా ఆడుతున్నారు" అని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ భవిష్యత్తు రాష్ట్ర రాజకీయాల్లో లేదని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. "ఈ విషయాన్ని నేను ముందే చెప్పాను. బీజేపీ నాయకుల బండారం బయట పెట్టేందుకు సగం క్యాబినెట్‌నే కామారెడ్డికి తీసుకువచ్చారు. ఈ సభ ద్వారా కేంద్రంపై సమర భేరి మోగిస్తాం. బండి సంజయ్, కిషన్ రెడ్డి బండారాన్ని బయట పెడతాం" అని ఆయన హెచ్చరించారు.

# ప్రశాంతంగా నిమజ్జనం!

- ముందస్తు ఏర్పాట్లు, బందోబస్తు
- డ్రోన్ల వినియోగం

**హైదరాబాద్, ప్రజాస్వరం :**



శనివారం ఉదయం 6:30 గంటల నుండి హైదరాబాద్ లో గణేష్ శోభయాత్రలు ప్రారంభం అయ్యాయి. ఈ శోభయాత్ర మొత్తం 40 గంటల పాటు నుండి కొనసాగుతుంది. ఇందుకు సంబంధించి హైదరాబాద్ సీపీ CV ఆనంద్ తెలిపిన వివరాల ప్రకారం, మొత్తం 12,034 విగ్రహాలకు ఆన్లైన్ లో ముందుగా పెర్మిషన్ ఇవ్వగా, ఇప్పటివరకు 6,300 విగ్రహాలు నిమజ్జనం పూర్తయ్యాయి. అదనంగా, 1 లక్షా 40 వేల విగ్రహాలు నిమజ్జనం జరిగినట్లు తెలిపారు. చిన్న విగ్రహాలను కలిపి ఇంకా 25 వేల విగ్రహాలు నిమజ్జనం అయ్యాయి. ఖైరతాబాద్ గణేష్ శోభాయాత్రతో పాటు, పండగ 10వ రోజు నిమజ్జన కార్యక్రమాలు నిర్విరామంగా కొనసాగాయి. సిబ్బంది నిద్ర లేకుండా సమన్వయం చేస్తూ పని చేశారు. ముందుగా సౌత్ జోన్ ప్రాంతాల విగ్రహాలు నిమజ్జనం పూర్తి చేయాలని ప్లాన్ లో భాగంగా.. మొత్తం 40 క్రేన్‌లు ఏర్పాటు చేశారు. అయితే, ఈ సారి విగ్రహాల అధిక సంఖ్య కారణంగా ఆలస్యం జరిగింది. కొన్ని చిన్న గొడవల కారణంగా 5 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఇంకా కొన్ని విగ్రహాలు ఈ రోజు రాత్రి లేదా రేపు ఉదయం నిమజ్జనం పూర్తయ్యేలా అధికారులు చర్యలు చేపట్టారు. డ్రోన్ల వినియోగం ఈసారి కీలక పాత్ర పోషించింది. మొత్తం 4 డ్రోన్లు ఉపయోగించి పర్యవేక్షణ చేశారు. అలాగే, 35 హై రైజ్డ్ బిల్డింగ్‌ల పై కెమెరాలు ఏర్పాటు చేసి ప్రత్యేక మానిటరింగ్ నిర్వహించారు. ఈ చర్యల వల్ల పండుగను మరింత సమర్థవంతంగా, సురక్షితంగా నిర్వహించ గలిగారు. సీఎం సదన్ గా ఎంట్రీ ఇచ్చారు. ఆయన సమర్థంగా పనుల నిర్వహణ పై ప్రశంసలు కురిపించారు. మొత్తం ప్రక్రియలో 1070 మంది ఆకతాయిలను గుర్తించి అరెస్ట్ చేశారు. కొందరిపై పిట్టీ కేసులు నమోదు చేసి, మరికొందరికి కౌన్సిలింగ్ అందించినట్లు CV ఆనంద్ పేర్కొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డితో ఫిరాయింపు ఎమ్మెల్యేల భేటీ

- బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులు
- అనర్హత వేటుపై తదుపరి కార్యాచరణపై కీలక చర్చలు
- సమావేశానికి గైర్హాజరైన ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో పెరిగిన రాజకీయ ఉత్కంఠ

**హైదరాబాద్, ప్రజాస్వరం**



తెలంగాణలో పార్టీ ఫిరాయింపుల వ్యవహారం మరోసారి వేడెక్కింది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలకు అసెంబ్లీ స్పీకర్ అనర్హత నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి వారితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఆదివారం జరిగిన ఈ భేటీలో తదుపరి అనుసరించాల్సిన వ్యూహంపై ఆయన సుదీర్ఘంగా చర్చించారు. బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిన 10 మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులు పంపిన విషయం తెలిసిందే. ఈ నోటీసులపై వివరణ ఇచ్చేందుకు తొలుత ఎమ్మెల్యేలు వారం రోజుల గడువు కోరారు. ఆ గడువు ముగియడంతో తదుపరి కార్యాచరణను నిర్ణయించుకునేందుకు వారంతా ముఖ్యమంత్రిని కలిశారు. అయితే, ఈ సమావేశానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి మినహా మిగిలిన తొమ్మిది మంది హాజరయ్యారు. ఇటీవల పార్టీ ఫిరాయింపులపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ఈ పరిణామాలకు మరింత ప్రాధాన్యతను చేకూర్చింది. ఈ నేపథ్యంలో స్పీకర్ నోటీసులను న్యాయపరంగా ఎలా ఎదుర్కోవాలి, ఎలాంటి వివరణ ఇవ్వాలనే అంశాలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చ జరిగినట్లు సమాచారం. అనర్హత వేటు నుంచి తప్పించుకునేందుకు ఉన్న మార్గాలపై వారు లోతుగా మంతనాలు జరిపారు. ఈ పరిణామం తెలంగాణ రాజకీయాల్లో మరోసారి ఫిరాయింపుల అంశాన్ని తెరపైకి తెచ్చింది. తమ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలను కాపాడుకునేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు ఈ భేటీ స్పష్టం చేస్తోంది. తదుపరి ఏం జరగనుందనే విషయంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

# ఆట,పాట... ఓ మంచిమాట: మంచుమనోజ్

**హైదరాబాద్, ప్రజాస్వరం**

విలక్షణ నటుడు మంచు మనోజ్ ఓ శక్తివంతమైన పాత్రతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. యంగ్ హీరో తేజ సజ్జా నటిస్తున్న 'మిరాయ్' చిత్రంలో ఆయన ప్రతినాయకుడిగా కనిపించనున్నారు. సినిమా ప్రమోషన్లలో భాగంగా మనోజ్ సోషల్ మీడియాలో పంచుకున్న ఓ వీడియో ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. పిల్లలతో కలిసి ఆయన సరదాగా క్రికెట్ ఆడుతున్న దృశ్యాలు ఆ వీడియోలో ఉన్నాయి.ఈ వీడియోను ట్వీట్ చేస్తూ, సినిమా ప్రమోషన్ల కోసం వైజాగ్‌కు వస్తున్నట్లు మనోజ్ ప్రకటించారు. "ఇవాళ సండే కదా... క్రికెట్ ఆడుతున్నాం. దాంతో పాటే బ్లాక్ స్వోర్డ్ ఇన్విటేషన్ కూడా! వైజాగ్... సిద్ధం ఉన్నారా... రేపు వచ్చేస్తున్నాం. ఆట, పాట.. మరియు ఓ మంచి మాట" అంటూ తనదైన శైలిలో అభిమానులకు సందేశమిచ్చారు. ఈ ట్వీట్‌తో సినిమా ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసినట్లు తెలుస్తోంది. ఫాంటసీ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న 'మిరాయ్' చిత్రంలో మనోజ్ 'బ్లాక్ స్వోర్డ్' అనే పవర్‌ఫుల్ విలన్ పాత్రను పోషిస్తున్నారు. ఈ సినిమాలో తేజ సజ్జా కథానాయకుడిగా నటిస్తుండగా, సీనియర్ నటి శ్రియ కూడా ఓ ముఖ్యమైన పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. నిర్మాతలు ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 12న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

# కవితకు చెక్ పెట్టటంతో పాటు.. ఆ ప్లాన్ తో ప్రజాక్షేత్రంలోకి కేటీఆర్!

**హైదరాబాద్, ప్రజా స్వరం**



రాష్ట్రంలో కవిత ఎపిసోడ్ తో బి ఆర్ ఎస్ పార్టీ మరింత దారుణంగా తయారయింది. ఈ సమయంలో బిఆర్ఎస్ పార్టీకి జవసత్వాలు నింపడంతో పాటు, కవితకు చెక్ పెట్టడానికి, ప్రత్యర్థి పార్టీలకు సైతం వెన్నులో వణుకు పుట్టించడానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో గత వారం రోజులుగా ఎర్రవల్లి ఫామ్ హౌస్ లో పార్టీ అధినేత కెసిఆర్ తో కేటీఆర్ మంతనాలు జరిపినట్టు తెలుస్తోంది.

**రంగంలోకి కేటీఆర్**

ప్రస్తుత పరిస్థితులలో పార్టీని బలోపేతం చేయడం పైన దృష్టి సారించాలని కేసీఆర్ కేటీఆర్ కు సూచించినట్టు సమాచారం. ఈ క్రమంలోనే మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్రవ్యాప్తంగా జిల్లాలలోనూ పర్యటనలు చేయాలని రెడీ అవుతున్నట్టు తెలుస్తోంది. పార్టీ నుండి కవితను బహిష్కరించిన తర్వాత పార్టీలో చోటు చేసుకున్న సంక్షోభాన్ని తొలగించడానికి, పార్టీ క్యాడర్లో నెలకొన్న గందరగోళాన్ని తగ్గించడానికి కేటీఆర్ రంగంలోకి దిగుతున్నట్టు సమాచారం.

ప్రజా క్షేత్రంలోకి కేటీఆర్.. మతలబు ఇదే

ముఖ్యంగా పార్టీ నుండి వీడిపోయిన ఎమ్మెల్యేలను, వారి నియోజకవర్గాలను లక్ష్యంగా చేసుకొని కేటీఆర్ రంగంలోకి దిగి క్షేత్ర స్థాయిలో పార్టీ కార్యకర్తలను, ప్రజలను కలవబోతున్నట్టు సమాచారం. ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికలలో పట్టు నిలుపుకోవడానికి, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో విజయం సాధించడానికి, ఇదే సమయంలో ప్రత్యర్థి పార్టీలకు, కవితకు చెక్ పెట్టడానికి కేటీఆర్ ప్రధానంగా దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది.

**కేటీఆర్ టూర్ ఖరారు..**

**ఈ నియోజకవర్గాల్లో పర్యటన**

ఈ క్రమంలోనే ఈనెల 10వ తేదీన కొత్తగూడెం, 11వ తేదీన భద్రాచలం నియోజకవర్గాలలో కేటీఆర్ పర్యటించనున్నారు. అనంతరం సెప్టెంబర్ 13వ తేదీన గద్వాల్ నియోజకవర్గంలో భారీ ర్యాలీ నిర్వహించి, ఆపై బహిరంగ సభలో పాల్గొననున్నారు. ఇక దసరా పండుగ లోపు వీలైనన్ని ఎక్కువ నియోజకవర్గాలలో పర్యటించాలని పార్టీ శ్రేణులలో నూతన ఉత్సాహాన్ని నింపాలని భావిస్తున్నారు. ప్రజల నుండి కేటీఆర్ కు స్పందన వస్తుందా? వచ్చే ఎన్నికలకు శ్రేణులను సన్నద్ధం చేయాలని కేటీఆర్ భావిస్తున్నారు. ప్రజాక్షేత్రంలోకి వచ్చి పర్యటనలు చేయనున్న కేటీఆర్ పార్టీ శ్రేణులను ఏ విధంగా బలోపేతం చేస్తారు అనేది ముందు ముందు తెలియనుంది. ప్రజల నుండి కేటీఆర్ పర్యటనకు ఏ మేరకు స్పందన వస్తుంది అనేది కూడా తెలియాల్సి ఉంది.

# వైజాగ్‌లో ఐసీసీ మహిళల ప్రపంచకప్ ట్రోఫీ

- విశాఖలో మహిళల ప్రపంచకప్ ట్రోఫీ ఆవిష్కరించిన ఏసీఏ పెద్దలు
- నగరంలో తొలిసారిగా ప్రపంచకప్ మ్యాచ్‌ల నిర్వహణ
- వైజాగ్‌లో రెండు మ్యాచ్‌లు ఆడనున్న టీమిండియా
- ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికాతో భారత్ కీలక పోరు
- ఇదో చారిత్రక ఘట్టమన్న ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్

**విశాఖపట్నం, ప్రజాస్వరం**

విశాఖపట్నంలో ఐసీసీ మహిళల వన్డే ప్రపంచకప్2025 సందడి మొదలైంది. టోర్నమెంట్‌లో విశాఖ నగరం కూడా మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇస్తుండటంతో, అధికారిక పర్యటనలో భాగంగా ఐసీసీ ప్రపంచకప్ ట్రోఫీని నగరానికి తీసుకొచ్చారు. ఈ చారిత్రక ఘట్టానికి గుర్తుగా ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) అధికారులు ఏసీఏవీడీసీఏ క్రికెట్ స్టేడియంలో ట్రోఫీని ఆవిష్కరించి తమ ఆనందాన్ని పంచుకున్నారు .ఈ కార్యక్రమంలో ఏసీఏ కార్యదర్శి సనా సతీష్ బాబు, సంయుక్త కార్యదర్శి బోయళ్ల విజయ్ కుమార్, రాష్ట్రానికి చెందిన మహిళా క్రికెటర్లతో కలిసి ట్రోఫీతో ఫొటోలకు ఫోజులిచ్చారు. అనంతరం ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ (నాని) మాట్లాడుతూ, ప్రపంచకప్ మ్యాచ్‌లకు విశాఖ ఆతిథ్యం ఇవ్వడం గర్వకారణమని అన్నారు. "మహిళల ప్రపంచకప్ మ్యాచ్‌లు ఇక్కడ జరగనుండటంతో మనం చరిత్రను చూడబోతున్నాం. ఈ ట్రోఫీ టూర్‌తో ఇప్పటికే ఆ వాతావరణం కనిపిస్తోంది. ఇది మన క్రీడాకారిణులకు స్ఫూర్తినిస్తుంది" అని ఆయన తెలిపారు. ఆంధ్ర నుంచి ఎందరో మహిళా క్రికెటర్లు దేశానికి ప్రాతినిధ్యం వహించారని గుర్తుచేశారు. ఏసీఏ కార్యదర్శి సనా సతీష్ బాబు మాట్లాడుతూ, ఆటగాళ్లకు, అభిమానులకు గుర్తుండిపోయే క్రికెట్ అనుభూతిని అందించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ టోర్నమెంట్ విజయవంతం కావాలని, ఎందరికో స్ఫూర్తినివ్వాలని ఆకాంక్షించారు.

వైజాగ్‌లో ఐదు మ్యాచ్‌లు

విశాఖపట్నం వేదికగా మొత్తం ఐదు ప్రపంచకప్ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఇందులో టీమిండియా ఆడే రెండు కీలక మ్యాచ్‌లు కూడా ఉన్నాయి. అక్టోబర్ 9న దక్షిణాఫ్రికాతో, అక్టోబర్ 12న డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియాతో భారత్ తలపడనుంది. ఇవే కాకుండా, అక్టోబర్ 13న బంగ్లాదేశ్‌దక్షిణాఫ్రికా, అక్టోబర్ 16న ఆస్ట్రేలియాబంగ్లాదేశ్, అక్టోబర్ 26న ఇంగ్లండ్‌న్యూజిలాండ్ మ్యాచ్‌లు కూడా ఇక్కడే జరుగుతాయి. ఇటీవలే భారత మహిళల జట్టు వారం రోజుల పాటు విశాఖలో సన్నాహక శిబిరంలో పాల్గొంది. సెప్టెంబర్ 30న శ్రీలంకతో జరిగే మ్యాచ్‌తో భారత్ తన ప్రపంచకప్ ప్రస్థానాన్ని ప్రారంభించనుంది.




# నేను ప్రధాని మోదీ ఫిట్‌నెస్ కు అభిమానిని: మిలింద్ సోమన్

- ప్రధాని మోదీ 75వ పుట్టినరోజు సందర్భంగా 'నమో యువ రన్'
- ప్రచారాన్ని ప్రారంభించిన ప్రముఖ నటుడు, ఫిట్‌నెస్ ఐకాన్ మిలింద్ సోమన్
- మోదీ ఫిట్‌నెస్ నిబద్ధతకు తాను పెద్ద అభిమానిని అని వెల్లడి
- సెప్టెంబర్ 21న దేశవ్యాప్తంగా 75 ప్రాంతాల్లో ఈవెంట్
- డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోరాటంలోనూ ఈ పరుగు భాగమేనని వ్యాఖ్య

**హైదరాబాద్ ,ప్రజాస్వరం**




ప్రముఖ మోడల్, నటుడు, ఫిట్‌నెస్ ఐకాన్ మిలింద్ సోమన్.. తాను ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి పెద్ద అభిమానినని, ముఖ్యంగా ఫిట్‌నెస్ పట్ల ఆయనకున్న నిబద్ధతను ఎంతగానో ఆరాధిస్తానని అన్నారు.ప్రధాని మోదీ 75వ పుట్టినరోజు వేడుకల సందర్భంగా భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) తలపెట్టిన 'నమో యువ రన్' ప్రచార కార్యక్రమాన్ని ఆయన ఆదివారం ఢిల్లీలో లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మిలింద్ సోమన్ మాట్లాడుతూ, "ఫిట్‌నెస్ అంటే కేవలం కండలు పెంచడం, సిక్స్ ప్యాక్ చేయడం మాత్రమే కాదు. జీవితంలోని ఒత్తిళ్ల మధ్య కూడా చురుగ్గా ఉంటూ, చేయాల్సిన పనులను సక్రమంగా చేయగలగడమే నిజమైన ఫిట్‌నెస్" అని వివరించారు. దేశవ్యాప్తంగా దాదాపు 10 లక్షల మంది యువతతో ఏకకాలంలో పరుగు నిర్వహించడం ఒక అద్భుతమైన కార్యక్రమమని ఆయన ప్రశంసించారు. "భారత్‌లోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా ఇంత పెద్ద ఎత్తున ఒకేసారి రన్ నిర్వహించడం బహుశా ఇదే మొదటిసారి. మార్పు రావాలంటే నిరంతర సాధన ముఖ్యం. ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని జరగాలి" అని ఆయన ఆకాంక్షించారు. ఈ పరుగు డ్రగ్స్‌కు వ్యతిరేకంగా దేశం చేస్తున్న పోరాటంలో యువతను భాగస్వాములను చేస్తుందని సోమన్ పేర్కొన్నారు. బీజేవైఎం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ తేజస్వి సూర్య మాట్లాడుతూ, సెప్టెంబర్ 21న ప్రధాని మోదీ పుట్టినరోజు సందర్భంగా ఈ 'నమో యువ రన్' జరుగుతుందని తెలిపారు. "దేశవ్యాప్తంగా 75 ప్రాంతాలలో ఈ పరుగును నిర్వహిస్తాం. ప్రతిచోటా 10 వేల నుంచి 15 వేల మంది యువత పాల్గొంటారు. అంటే, దాదాపు 10 లక్షల మంది యువత ఒకే సమయంలో పరుగెత్తుతారు. దేశంలోనే అతిపెద్ద రన్‌గా ఇది రికార్డు సృష్టిస్తుంది" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయ, ఎంపీ తేజస్వి సూర్య తదితరులు పాల్గొన్నారు.



# వైజాగ్‌లో గ్లాస్ స్కైవాక్

- కైలాసగిరిపై ప్రపంచస్థాయి పర్యాటక ఆకర్షణ
- స్కైవాక్‌పై స్పందించిన ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా
- చూడటానికి అద్భుతంగా ఉందంటూ ప్రశంస
- ఎత్తంటే భయమని, అక్కడికి వెళ్లలేనని సరదా వ్యాఖ్య
- వీడియోలలో చూసి ఆనందిస్తానన్న మహీంద్రా

విశాఖపట్నం,ప్రజాస్వరం



సాగరనగరం విశాఖపట్నంలోని కైలాసగిరి కొండపై కొత్తగా నిర్మించిన గ్లాస్ స్కైవాక్‌పై ప్రముఖ పారిశ్రామికవేత్త, మహీంద్రా గ్రూప్ ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా ఆసక్తికరంగా స్పందించారు. ఈ స్కైవాక్ చూడటానికి అద్భుతంగా ఉందని ప్రశంసిస్తూనే, తనకు ఎత్తైన ప్రదేశాలంటే భయమని, అందుకే అక్కడికి వెళ్లే సాహసం చేయలేకపోవచ్చని సరదాగా వ్యాఖ్యానించారు. వచ్చే వారం ప్రారంభం కానున్న ఈ పర్యాటక ఆకర్షణపై ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. విశాఖలోని ఈ కొత్త స్కైవాక్ గురించిఆనంద్ మహీంద్రా మాట్లాడుతూ, "ఇది చూడటానికి ఎంతో అద్భుతంగా ఉంది. కానీ నాకు, ఎత్తైన ప్రదేశాలకు మధ్య ఓ సంక్లిష్టమైన సంబంధం ఉంది. అందుకే ప్రస్తుతానికి ఇంటి దగ్గరే ఉండి వీడియోలలో ఈ దృశ్యాలను చూసి ఆస్వాదిస్తాను" అని తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. ఆయన మాటలు ఈ ప్రాజెక్టుపై దేశవ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తించాయి. కైలాసగిరిపై నిర్మించిన ఈ గ్లాస్ స్కైవాక్ సుమారు 262 మీటర్ల (860 అడుగులు) ఎత్తులో ఉంది. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన స్కైవాక్‌లలో ఒకటిగా దీనికి గుర్తింపు లభించనుంది. ప్రస్తుతం ప్రపంచంలో అత్యంత ఎత్తైన, పొడవైన గ్లాస్ బ్రిడ్జి రికార్డు చైనాలోని జాంగ్‌జియాజీ వంతెన పేరిట ఉంది. ఇది 300 మీటర్ల ఎత్తు, 430 మీటర్ల పొడవుతో సందర్శకులను ఆకట్టుకుంటోంది. ఇప్పుడు విశాఖ స్కైవాక్ కూడా అంతర్జాతీయ స్థాయిలో పర్యాటకులను ఆకర్షిస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రారంభానికి ముందే జాతీయ స్థాయిలో ఇంతటి ప్రచారం లభించడం విశేషం.

# రూ.1,88,888కు గణేష్ లడ్డూ దక్కించుకున్న ముస్లిం మహిళ



హైదరాబాద్, ప్రజాస్వరం

తెలంగాణలో మతసామరస్యం వెల్లివిరిసింది. ఓ ముస్లిం మహిళ గణేష్ లడ్డూను దక్కించుకుంది. అది కూడా భారీ ధరకు దక్కించుకుంది. దీంతో స్థానికులు ఆమెను అభినందిస్తున్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఆదర్శనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకుడి నిమజ్జనం సందర్భంగా లడ్డూను వేలంపాట వేశారు. ఈ వేలం పాటలో అదే కాలనీకి చెందిన ముస్లిం మహిళ అఫ్రీన్ పాల్గొంది. ఆమె రూ. రూ.1,88,888 కు లడ్డూను దక్కించుకుంది. దీంతో ఆమెకు స్థానికులు శుభాకాంక్షలు చెబుతున్నారు. ఈ ఘటన ప్రస్తుతం నెట్టింట వైరల్ గా మారింది. తెలంగాణలోని నిర్మల్ జిల్లాలో మతసామరస్యం వెల్లివిరిసింది. నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఆదర్శ నగర్ కాలనీలో అద్భుతం జరిగింది. ఓ ముస్లిం మహిళ గణేష్ లడ్డూను దక్కించుకుంది. దీంతో ఈ వార్త సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారింది. నిర్మల్ పట్టణంలోని ఈద్గాం ఆదర్శ్ నగర్ గణపతి లడ్డూ వేలంలో రూ.1,88,888 కు లడ్డూను ముస్లిం మహిళ అఫ్రీన్ దక్కించుకుంది. దీంతో ఆమెకు స్థానికులు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ఆమె ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచింది. నిర్మల్ జిల్లాలో మరో ఘటన జరిగింది. కుంటాల మండలంలోని అంబకంటిలో గణేష్ నిమజ్జనం వేల నిర్వహించిన వేలం పాటలో స్థానికులుగా ఉన్న ఓ ముస్లిం కుటుంబం వేలంపాటలో పాల్గొంది. ఈ క్రమంలో ఏడవ తరగతి విద్యార్థి రెహమాన్ రూ. 1111 వేలం పాట పాడి లడ్డూను దక్కించుకున్నాడు.అటు మహారాష్ట్రలోనూ ఇలాంటి ఘటనే జరిగింది. అక్కడ కూడా మతసామరస్యం వెల్లివిరిసింది. మహారాష్ట్రలోని సాంగ్లీ జిల్లా గోట్ఖిండీ గ్రామంలోని ఓ మసీదులో ముస్లింలు వినాయకుడిని ఏర్పాటు చేసి 9 రోజుల పాటు నవరాత్రి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సంప్రదాయం 1980లోనే అక్కడ ప్రారంభమైంది. ఏటా గణేష్ నవరాత్రులు నిర్వహించి విగ్రహాన్ని నిమజ్జనం చేస్తారు. హిందూముస్లింలు ఉమ్మడిగా ఈ వేడుకల్లో పాల్గొంటారు.

# కారుకు రూ.8 లక్షల చలాన్

- అఖిలేశ్ యాదవ్ కాన్వాయ్‌కు రూ.8 లక్షల జరిమానా
- అతివేగంగా వెళ్లారంటూ చలాన్ విధించిన అధికారులు
- దీని వెనుక బీజేపీ నేత హస్తం ఉందన్న అఖిలేష్
- వ్యవస్థను నడిపేదెవరో తేలుస్తానని వ్యాఖ్య
- యూపీ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమైన ఘటన

హైదరాబాద్, ప్రజాస్వరం



సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధినేత, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్ సంచలన ఆరోపణలు చేశారు. తన కాన్వాయ్‌లోని వాహనాలకు ఏకంగా రూ.8 లక్షల జరిమానా విధిస్తూ చలాన్ పంపారని, దీని వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందని ఆయన ఆరోపించారు. ఇది పూర్తిగా బీజేపీ కక్ష సాధింపు చర్యేనని ఆయన పరోక్షంగా విమర్శించారు. ఈ విషయంపై అఖిలేశ్ మాట్లాడుతూ, "నిన్న నాకు కొన్ని పత్రాలు అందాయి. నా కారు అతివేగంగా ప్రయాణించినందుకు రూ.8 లక్షల జరిమానా చెల్లించాలని అందులో ఉంది. ప్రభుత్వానికి నిఘా కెమెరాలు ఉన్నాయి కాబట్టి నా వాహనం దొరికి ఉండవచ్చు. కానీ, ఈ మొత్తం వ్యవహారం వెనుక ఒక బీజేపీ నేత ఉన్నారని నేను బలంగా నమ్ముతున్నాను" అని అన్నారు. ఆగిపోకుండా, "ఈ వ్యవస్థను ఎవరు నడిపిస్తున్నారో నేను త్వరలోనే కనుక్కుంటాను. అతను కచ్చితంగా బీజేపీకి చెందిన వ్యక్తే అయి ఉంటాడు" అని అఖిలేశ్ యాదవ్ తీవ్ర అనుమానం వ్యక్తం చేశారు. కేవలం రాజకీయంగా ఎదుర్కోలేకే తనపై ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. అఖిలేశ్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం యూపీ రాజకీయాల్లో పెను దుమారం రేపుతున్నాయి. ఒక మాజీ ముఖ్యమంత్రికి ఇంత పెద్ద మొత్తంలో చలాన్ విధించడం, దానిపై ఆయన నేరుగా అధికార పార్టీపై ఆరోపణలు చేయడంతో ఈ అంశం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# వరంగల్‌లో థ్రిల్లర్ సీన్

- భారీ వర్షంతో వరదలో చిక్కుకున్న బస్సులు.. ప్రయాణికుల ఆర్తనాదాలు!
- వరంగల్‌లో కుండపోత వర్షం.. జలమయమైన రైల్వే అండర్ బ్రిడ్జి
- వరద నీటిలో చిక్కుకుపోయిన రెండు ఆర్టీసీ బస్సులు
- బస్సుల్లో సుమారు 100 మంది ప్రయాణికులు
- ప్రాణభయంతో ప్రయాణికుల హాహాకారాలు
- తాడు సాయంతో అందరినీ కాపాడిన పోలీసులు
- అండర్ బ్రిడ్జి మార్గం మూసివేత, ట్రాఫిక్ మళ్లింపు

వరంగల్, ప్రజాస్వరం




ఈ ఉదయం కురిసిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. నగరంలోని రైల్వే అండర్ బ్రిడ్జి కిందకు భారీగా వరద నీరు చేరడంతో ఆ మార్గంలో వెళ్తున్న రెండు ఆర్టీసీ బస్సులు పూర్తిగా చిక్కుకుపోయాయి. బస్సుల్లో ఉన్న సుమారు వంద మంది ప్రయాణికులు ప్రాణ భయంతో ఆర్తనాదాలు చేయడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అన్నారం, మహబూబాబాద్ ప్రాంతాల నుంచి వస్తున్న రెండు ఆర్టీసీ బస్సులు ప్రయాణికులతో వరంగల్ చేరుకున్నాయి. అయితే, ఉదయం కురిసిన కుండపోత వానకు రైల్వే అండర్ బ్రిడ్జి పూర్తిగా జలమయమైంది. లోతును అంచనా వేయలేక ముందుకు వెళ్లిన బస్సులు వరద నీటిలో చిక్కుకోవడంతో ఇంజిన్లు ఆగిపోయి మధ్యలోనే నిలిచిపోయాయి. నీటిమట్టం క్రమంగా పెరుగుతుండటంతో బస్సుల్లోని ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురై కేకలు వేశారు. పరిస్థితిని గమనించిన స్థానికులు తక్షణమే మిల్స్ కాలనీ పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. స్థానికుల సహకారంతో ఒక పెద్ద తాడును బస్సుల వద్దకు చేరవేసి, దాని సాయంతో ప్రయాణికులను ఒక్కొక్కరిగా సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. సుమారు వంద మందిని కాపాడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటన అనంతరం పోలీసులు ముందుజాగ్రత్త చర్యగా ఆ మార్గాన్ని పూర్తిగా మూసివేశారు. వాహన రాకపోకలను మరో దారికి మళ్లించారు. పోలీసుల సత్వర స్పందనతో పెను ప్రమాదం తప్పిందని ప్రయాణికులు, స్థానికులు తెలిపారు.

# కార్ల ధరలను భారీగా తగ్గించిన హ్యుందాయ్

- హ్యుందాయ్ కార్ల ధరల్లో భారీ కోత, పండగ సీజన్ ముందు ప్రకటన
- జీఎస్టీ సంస్కరణల ప్రయోజనాన్ని వినియోగదారులకు అందిస్తున్న కంపెనీ
- టూసాన్ మోడల్‌పై గరిష్ఠంగా రూ. 2.4 లక్షల వరకు తగ్గింపు
- క్రెటా, వెర్నా, ఐ20 వంటి ఇతర కార్లపైనా గణనీయమైన డిస్కౌంట్లు
- సెప్టెంబర్ 22 నుంచి కొత్త ధరలు అమల్లోకి రానున్నాయి
- చిన్న కార్లపై జీఎస్టీని 18 శాతానికి తగ్గించడంతో ధరల కోత

హైదరాబాద్, ప్రజాస్వరం

పండగ సీజన్ సమీపిస్తున్న తరుణంలో, ప్రముఖ కార్ల తయారీ సంస్థ హ్యుందాయ్ మోటార్ ఇండియా వినియోగదారులకు ఓ శుభవార్త అందించింది. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జీఎస్టీ సంస్కరణల ప్రయోజనాన్ని పూర్తిగా కస్టమర్లకు బదిలీ చేస్తూ, తమ ప్యాసింజర్ వాహనాల ధరలను భారీగా తగ్గిస్తున్నట్లు ఆదివారం ప్రకటించింది. ఈ తగ్గింపుతో హ్యుందాయ్ కార్లు గరిష్ఠంగా రూ. 2.4 లక్షల వరకు తగ్గింపుతో చౌకగా లభించనున్నాయి. సెప్టెంబర్ 22 నుంచి ఈ కొత్త ధరలు దేశవ్యాప్తంగా అమల్లోకి రానున్నాయని కంపెనీ స్పష్టం చేసింది. ఈ ధరల కోతలో భాగంగా, హ్యుందాయ్ ఫ్లాగ్‌షిప్ ఎస్‌యూవీ అయిన టక్సన్‌పై అత్యధికంగా రూ. 2,40,303 వరకు తగ్గింపు లభించనుంది. దీంతో పాటు మార్కెట్లో అత్యంత ప్రజాదరణ పొందిన గ్రాండ్ ఐ10 నియోస్, ఆరా, ఎక్స్‌టర్, ఐ20, వెన్యూ, వెర్నా, క్రెటా, అల్కాజార్ వంటి ఇతర మోడళ్ల ధరలు కూడా సుమారు రూ. 60,000 నుంచి రూ. 1.2 లక్షల శ్రేణిలో తగ్గనున్నాయి. ఇటీవల జరిగిన 56వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ప్యాసింజర్ వాహనాలపై పన్నులను సవరించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీని ప్రకారం, చిన్న కార్లపై జీఎస్టీని 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించారు. ఈ సంస్కరణల కారణంగా తగ్గిన పన్ను భారాన్ని నేరుగా వినియోగదారులకు అందించాలని హ్యుందాయ్ నిర్ణయించింది. ఈ నిర్ణయం ఆటోమొబైల్ రంగానికి మరింత ఊతమిస్తుందని కంపెనీ భావిస్తోంది. ఈ సందర్భంగా హ్యుందాయ్ మోటార్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ ఉన్సూ కిమ్ మాట్లాడుతూ, "ప్రభుత్వం తీసుకున్న ఈ ముందుచూపుతో కూడిన నిర్ణయాన్ని మేము మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నాం" అని తెలిపారు. ఈ సంస్కరణ ఆటో పరిశ్రమకు ప్రోత్సాహాన్ని ఇవ్వడమే కాకుండా, లక్షలాది మంది భారతీయులకు సొంత వాహన కలను మరింత అందుబాటులోకి తెస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. పండగ సీజన్‌లో ఈ ధరల తగ్గింపు అమ్మకాలను గణనీయంగా పెంచుతుందని కంపెనీ ధీమా వ్యక్తం చేస్తోంది.






# హన్మకొండలో రైతుల కోసం పాదయాత్ర.. ఎర్రబెల్లి హాట్ కామెంట్స్

- వెంకటాపురం నుండి నష్కల్ వరకు రైతుల పాదయాత్ర ప్రారంభం
- దేవాదుల పనులు పూర్తి అయ్యే వరకు కాంగ్రెస్‌ను వదలమన్న ఎర్రబెల్లి
- రేవంత్ రెడ్డి, కడియం శ్రీహరి పై తీవ్ర వ్యాఖ్యలు

హైదరాబాద్, ప్రజాస్వరం

హన్మకొండ జిల్లా అయినవోలు మండలం వెంకటాపురం గ్రామం నుండి స్టేషన్ ఘన్పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య రైతుల కోసం పాదయాత్రను ప్రారంభించారు. వెంకటాపురం నుండి ప్రారంభమైన ఈ పాదయాత్ర నష్కల్ వరకు కొనసాగనుంది. ఈ కార్యక్రమాన్ని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. “కాంగ్రెస్ పాలనలో రైతులు అరిగోసలు పడుతున్నారు. వాదుల పనులు పూర్తి చేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టేది లేదు” అని ఎర్రబెల్లి స్పష్టం చేశారు. అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ మంత్రి కడియం శ్రీహరిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. “రేవంత్ రెడ్డికి అబద్ధాలు ఆడడం అలవాటు. కడియం శ్రీహరి చెప్పే మాటలన్నీ తుపాకి రాముని మాటల్లా ఉంటాయి. ఇద్దరూ తోడు దొంగలే. ఇద్దరూ నా వెంట తిరిగిన వాళ్లే, వాళ్ల గుణం, క్యారెక్టర్ నాకు బాగా తెలుసు” అని ఎర్రబెల్లి ఆరోపించారు.తన రాజకీయ ప్రస్థానం గురించి ప్రస్తావిస్తూ.. “నేను ఏడు సార్లు గెలిచాను. మూడుసార్లు గెలిచినవాడు అబద్ధాలతో ముఖ్యమంత్రి అయ్యాడు. అమ్మాయి చేతిలో నేను ఓడిపోయానని కడియం శ్రీహరి ఎద్దేవా చేస్తున్నారు. నేను ఏడు సార్లు గెలిచాను, నువ్వు ఎన్నిసార్లు గెలిచావో, ఎన్నిసార్లు ఓడావో గుర్తు చేసుకో” అని ఎర్రబెల్లి దయాకర్ రావు వ్యాఖ్యానించారు. పాలకుర్తి నియోజకవర్గ ప్రజలకు మంచి ఏదో, చెడు ఏదో బాగా అర్థమైందని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్‌పై ప్రజా వ్యతిరేకత మరింత పెరుగుతుందని అన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999